



బాలచంద్రుడి వేషధారణలో మంత్రి దుర్గేష్



చంద్రబాబుతో యనమల కరచాలనం

ఆడేశా.. కబడ్డీ

మద్దతుగా మన మహిళా నేతలు

హై..హై..నాయకా!

కూటమి నాయకులను ఒక వైపే చూశాం.. రెండో వైపు చూడలేదు.. గత మూడు రోజులుగా అదీ చూపించారు. అమరావతి కేంద్రంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనల్లోనూ తమ సత్తా చాటారు. బుధవారం కబడ్డీ పోటీల్లో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నువ్వా నేనా అంటూ తలపడ్డారు. 60 ఏళ్లు పైబడిన కేటగిరీలో వంద మీటర్ల విభాగంలో తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. గురువారం పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ బాలచంద్రుడి ఏకపాత్రాభినయంలో ద్వితీయ బహుమతి కొట్టేశారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మ్యూజికల్ చైర్స్‌లో ప్రథమ బహుమతి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ క్యారమ్స్‌లో ప్రథమ బహుమతి, టెన్నికాయిట్ డబుల్స్‌లో విన్నర్‌గా నిలిచారు.



హలీమ్.. సలాం!

చూస్తే నోరూరుతోంది.. ఏడాదికి ఒక్కసారైనా తినాలనిపిస్తుంది.. ఎందుకంటే ముస్లింల వంటకం మరి.. ఆరోగ్యం.. బలమైన ఆహారం.. రంజాన్ మాసం సందర్భంగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నగరాల్లో జనం ముందుకు వచ్చేసింది.. జనం కూడా ఎగబడుతున్నారు.. 15 రకాల మసాలాలతో తయారు చేసే హలీమ్‌కు సలామ్ కొడుతున్నారు..

6

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:20 (శుక్రవారం సాయంత్రం)

సహర్: 4:45 (శనివారం ఉదయం)



రియల్..లాస్!

ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల రాబడికి గండి

- ముగుస్తున్న ఆర్థిక సంవత్సరం
- మరో 10 రోజులే గడువు
- ఇంకనూ పూర్తికాని లక్ష్యం
- 64 శాతమే రిజిస్ట్రేషన్లు
- ఈ ఏడాది లక్ష్యం రూ.70 కోట్లు
- కేవలం రూ.45 కోట్లే ఆదాయం
- లక్ష్యానికి చేరువగా అనంతపల్లి
- దూరంగా వేగేశ్వరపురం
- కష్టంగా మారిన లక్ష్య సాధన
- నవంబరు నుంచి నత్తనడక
- గత వైసీపీ 2.0నే కారణం
- నేటికీ కోలుకోని తీరు
- మందకొడిగా లావాదేవీలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మంత్రదండాన్ని బయటకు తీసినా ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల శాఖ లక్ష్యాన్ని సాధించడం అసాధ్యంగా కనిపిస్తోంది.2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇంకా 10 రోజులు మాత్రమే సమయం ఉంది. జిల్లాలో ఇంకా 70 శాతం లక్ష్యాన్ని కూడా ఆ శాఖ చేరుకోలేదు. వాస్తవానికి ఐదు నెలల నుంచీ రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగుతున్నాయి. కారణాలేమైనప్పటికీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ దశలోనూ రిజిస్ట్రేషన్లు పుంజుకోడానికి అధికారులు చొరవ చూపలేదనే విమర్శలు వినవస్తున్నాయి. జిరాక్సు కాపీలు ఇస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన అయోమయంలో నెలలు గడిచిపోవడం,మరోవైపు రియల్ ఎస్టేటు రంగం కుదేలు కావడం కూడా రాబడి ని తగ్గించిందని చెబుతున్నారు.జిల్లాలో నత్తనడ కన సాగుతున్న రిజిస్ట్రేషన్లపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

ఆదాయానికి గండి

రిజిస్ట్రేషన్ల ఆదాయానికి జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం భారీ గండి పడింది. గత నవంబరు నుంచీ రిజిస్ట్రేషన్లు నత్తన డకన సాగుతున్నాయి.గతేడాది ఎన్ని కల సంవత్సరం కావడంతో కాస్త ఇబ్బంది ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన కార్డ్‌ప్రైం 2.0 లోని సమస్యలు దానికి తోడయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుదు రుకోడానికి సాధారణంగానే సమయం పట్టింది.ఆ సమయంలో రిజిస్ట్రేషన్ల శాఖ కూడా పెద్దగా పట్టింపులేకుండా పని చేసింది.దీంతో గత నవంబరు నుంచీ రిజిస్ట్రేషన్లలో తీవ్ర మందగ మనం నడుస్తోంది.జనవరి నెలలో సంక్రాంతి పండుగ సందర్భంగా రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరుగుతుంటాయి.కానీ ఈ జనవరి దానికి భిన్నంగా ఫలితాలను ఇచ్చింది.ఫిబ్రవరి 1 నుంచీ భూముల ధరలు కాస్త పెరగడం కూడా ప్రభావం చూపింది. వివిధ రకాల కారణాలతో రియల్ ఎస్టేట్ పడకేసింది. దీంతో రిజిస్ట్రేషన్ల ఆదాయం భారీగా తగ్గింది.మార్చి 31ని ముం దుకు జరిపితే తప్ప ఏమి చేసినా ఈ ఏడాది లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యమనే చెప్పవచ్చు.

జిల్లాలో రిజిస్ట్రేషన్లు ఇలా..

ఎస్ఆర్‌వో	లక్ష్యం(లక్షల్లో)	20వ తేదీకి	శాతం
అనపర్తి	2319.01	1688.05	72.79
అనంతపల్లి	3166.16	2820.39	89.08
బిక్కవోలు	2644.40	1893.14	71.59
కడియం	5955.22	3637.60	61.08
కోరుకొండ	3203.80	1619.30	50.54
కొవ్వూరు	5759.41	4180.24	72.58
నిడదవోలు	4488.22	2866.70	63.87
పిడింగొయ్యి	7165.07	4732.48	66.05
రాజమహేంద్రవరం	23034.97	15121.71	65.65
రాజానగరం	9421.49	4938.15	52.41
సీతానగరం	982.62	678.15	69.01
వేగేశ్వరపురం	2003.99	917.35	45.78
మొత్తం	70144.36	45093.26	64.29

70 శాతానికీ.. చేరుకోలేదు

ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల ఆదాయం లక్ష్యాన్ని ఛేదించడం మాట అలా ఉంచితే కనీసం 70 శాతాన్ని అందుకోలేకపో యింది. ఈ ఆర్థిక ఏడా ది లక్ష్యం రూ.70 కోట్లు కాగా రూ.45 కోట్లు దాటి నెమ్మదిగా అడుగులు వేస్తోంది. జిల్లాలోని రిజిస్ట్రేషన్ల శాఖకు ప్రధాన ఆదాయ వనరు లుగా చెప్పుకోదగిన కడియం,రాజమహేంద్ర వరం,రాజానగరం, పిడింగొయ్యి సబ్-రిజిస్ట్రారు కార్యాలయాలు పూర్తిగా నిరాశ పరి చాయి. లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఈ పది రోజుల్లో రాజమహేంద్రవరం 8 కోట్లు,కడియం రూ.2.40 కోట్లు, పిడింగొయ్యి రూ.2.30 కోట్లు, రాజానగరం రూ.5 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. ఇది సాధ్యమయ్యే పనికాదని అధికారులు సైతం చేతులెత్తేస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం రాబడిలో మొదటి మూడు స్థానాల్లో అనంతపల్లి, అనపర్తి, కొవ్వూరు ఉండగా వేగే శ్వరపురం చివరి స్థానంలో ఉంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ కొద్ది రోజులుగా జిల్లాపై దృష్టి సారించినా ఫలితాలు ఆశాజనకంగా కనిపించకపోవడం గమనార్హం.

ఎండ తీవ్రతపై దృష్టి పెట్టండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత పెరిగి వడగాడ్పులు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో గురువారం క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో వడగాలులు తీవ్రత దృష్ట్యా ఉదయం రెవెన్యూ డివిజనల్ అధికారులు, సాయంత్రం మండల,మునిసిపల్ అధికారుల సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి నిర్దిష్టకార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు చలివేంద్రాల ద్వారా చల్లని నీరు సరఫరా చేయాలన్నారు. ఒంటిపూటబడుల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఉపాధి కూలీలు పనిచేసే చోట్ల నీడ ఉం డేలా టెంట్లు ఏర్పాటు చేసి తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచా లన్నారు. వేసవి దృష్ట్యా ఐస్ ఫ్యాక్టరీలపై తనిఖీలు చేయాలన్నారు. వడగాలుల కార ణంగా అనారోగ్యం పాలై మరణాలు సంభవిస్తే 24 గంటల్లో నివేదిక అందజేయాలన్నారు.పాఠశాలల విషయంలో ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు నెంబరు 9398580029కు ఫిర్యాదు చేయ్యవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీవీ గిరి, డీపీవో వి.శాంతా మణి, డీఈవో ఎస్.వాసుదేవరెడ్డి, డీఎల్‌డీవో వీణా దేవి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో సమీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఎండలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలోని వైద్యాధికారులు కార్యాచరణ ప్రణాళికతో సంసిద్ధం కావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లావైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం జిల్లా ప్రోగ్రాం అధికారులు, వైద్యసిబ్బందితో సమీక్షించారు. ఉదయం 11 గంటలకే బయటి పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లినప్పుడు వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే అవి వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జే.సంధ్య, కంటి వెలుగు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లావణ్య, డిప్యూటీ డెమో డాక్టర్ సత్యకుమార్, డాక్టర్ మౌనిక, సీహెచ్‌వో జాన్సన్, శర్మ, డాక్టర్ నిశాంత్, షమ్మీకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దగూడెంలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలి

గోపాలపురంలో కలెక్టర్

గోపాలపురం, మార్చి20 (ఆంధ్రజ్యోతి) :డయేరియా పూర్తిగా అదుపులో ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.గోపాలపురం మండలం పెద్దగూడెంలో గురువారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు.సత్యసాయి పథకం తాగునీరు సరఫరా చేస్తున్న రక్షిత మంచి నీటి ట్యాంకులను పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు శుద్ధిచేసిన తాగునీటిని సరఫరా చేయాలన్నారు. నీటినమూనాలు పరిక్షించడం, వాటర్ ట్యాంకుల క్లోరినేషన్ చేయడం శుద్ధి చేసిన జలాలను ప్రజలకు అందించడం సాధ్యమవుతుందన్నారు. స్టోరేజ్ ట్యాంకుల పై మూతలు ఉంచడం, నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపించి పరీక్షించడం తప్పనిసరిగా చేయాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఆమె వెంట మెడికల్ ఆఫీసర్ రాజీవ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అజయ్‌బాబు,ఏఈ బంగారయ్య, కార్యదర్శి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ గళం

బలభద్రపురంలో 200 కేన్సర్ కేసులు

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అనపర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామాన్ని కేన్సర్ మహమ్మారి నుంచి కాపాడాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం అసెంబ్లీలో కోరారు. బిక్కవోలు మండలం బలభద్రపురంలో సుమారు 200 మంది కేన్సర్‌తో భాదపడుతున్నారని సుమారుగా 30 మంది పైగా కేన్సర్ భారిన పడి మరణించారన్నారు.ఈ పరిస్థితి అంతుపట్టకుండా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రాసిమ్ ఇండస్ట్రీని ఏర్పాటు చేసిన నాటి నుంచి గ్రామంలో ఆరోగ్య సమస్యలు పెరిగాయన్నారు. ప్రభుత్వం శ్రద్ధ వహిం చి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను కాపాడాలన్నారు.పర్యావరణ, వైద్య ఆరోగ్య శాఖలు దృష్టి సారించాలని సభను కోరారు.

సమానత్వమే లక్ష్యంగా ఎస్సీ వర్గీకరణ

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



గోపాలపురం,మార్చి 20 (ఆంధ్రజ్యో తి) : పేదరిక నిర్మూలన, సమానత్వమే లక్ష్యంగా ఎస్సీ వర్గీకరణ చేశారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణపై ఆయన మాట్లాడారు.ఉపకులాల మధ్య ఉన్న అభిప్రాయాలు తీసుకుని ఏ,బీ,సీ,డీ వర్గీకరణకు సభలో ఆమోదం తెలపడం గర్వంగా ఉందన్నారు.1984లో టీడీపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తే ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు సాంకేతిక పరిజ్ఞానంతో పాఠశాల లను మరింత అభివృద్ధి చేశారన్నారు. నా ఉన్నత చదువులకు సాంఘిక సం క్షేమ గురుకులాలు దోహదపడ్డాయన్నారు.



రాజానగరంలో విద్యుత్ సమస్యలు

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పూర్తిగా గాలికొదిలేసిందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అసెంబ్లీతో తన గళాన్ని వినిపించారు. ప్రధానంగా నియోజకవర్గంలో లైన్‌మెన్ల కొరత వేధిస్తుందన్నారు. నియోజకవర్గంలో 73 ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల్లేక, 1851 చోట్ల వీధి లైట్లు లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైసీపీ పాలనలో 350 అగ్రికల్చర్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గతంలో డ్యామేజ్ జరిగిన చోట్ల రీప్లేస్ చేయడానికి మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను గత పాలకులు రియల్ ఎస్టేట్‌లో ఉపయోగించుకున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు.అనంతరం మంత్రి లోకేశ్‌ను కలిసి రాజానగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు, కోరుకొండ,రాజానగరాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని విన్నవించారు.దీనిపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారని బత్తుల తెలిపారు.



గ్రామస్తుల సమస్యలు వింటున్న పోలీసులు

4240 మందికి రూ.6.19 కోట్లు

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహనిర్మాణానికి అదనపు సహాయం కింద 4240 మంది లబ్ధిదారులకు రూ. 6.19 కోట్లు విడుదల చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా గురువారం రాత్రి క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి ఎఫ్‌టీవో విడుదల చేసి పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 21,584 మంది ఎస్సీ ఎస్టీ బీసీలకు చెందిన గృహనిర్మాణ పనులు పూర్తి చేయవలసి ఉందన్నారు.అదనపు సహాయం కింద ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీజీటీ (ట్రైబ్స్)కు రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 8540 మంది లబ్ధిదారులకు సమాచారం ఇచ్చి క్షేత్రస్థాయిలో 8477 మందిని కలసి మార్గదర్శకాలు వివరించినట్టు చెప్పారు.ఆర్థిక సహాయం పొందిన వారిలో ఎస్సీలు 1724, బీసీలు 2413, ఎస్టీలు 112మంది ఉన్నారన్నారు. ఇది రాష్ట్రంలోనే మొదటి స్థానం అన్నారు. 5678 మంది ఇంటి నిర్మాణానికి ముందుకు వచ్చారన్నారు.

పోలీస్.. పల్లెనిద్ర..

తొర్రేడులో ప్రారంభం

రాజమహేంద్రవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులు ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో పల్లెనిద్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. అడిషనల్ ఎస్పీ (శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు బుధవారం రాత్రి తొర్రేడు గ్రామంలో నిద్రించారు. అంతకు ముందు ప్రధాన కూడళ్లలో ప్రజలకు ఇవాళ సమాజంలో జరుగుతున్న నేరాలతీరు, అప్రమత్తంగా ఉండే విధానంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాల వల్ల దుష్పరిణామాలు, డయల్ 112, శక్తి యాప్ తదితర అంశాలపై చైతన్యం చేశారు. గ్రామ పెద్దలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.ఆయన వెంట సీఐ వీరయ్య గౌడ్,ఎస్ఐ మనోహర్ ఉన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు.ఆయా స్టేషన్ల అధికారులు గురు వారం రద్దీ కూడళ్లు, పాఠశాలలు, కళా శాలలకు వెళ్లి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి..రిజిస్ట్రేషను చేయించడంతో పాటు వినియోగంపై శిక్షణ ఇచ్చారు.

నిడదవోలులో వేడెక్కిన రాజకీయం

- చైర్మన్‌పై అవిశ్వాసానికి రెడీ
- వైసీపీ కౌన్సిలర్ల ముందడుగు
- కలెక్టర్,ఆర్‌డీవోలకు విన్నపం
- ఈ నెల 18కి నాలుగేళ్లు పూర్తి
- పట్టు బిగిస్తున్న జనసేన
- ఇప్పటికే కూటమిలో 10 మంది
- జనసేనలోకి మరో నలుగురు?
- మారుతున్న పరిణామాలు

నిడదవోలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మునిసిపాలిటీలో రాజకీయం ఒక్కసారి వేడెక్కింది..కౌన్సిల్ సభ్యులు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఎలాగైనా సరే చైర్మన్ కుర్చీని కైవసం చేసుకోవాలని అటు వైసీపీ, వైసీపీని చిత్తుగా ఓడించాలని జనసేన వ్యూహ ప్రతివ్యూహాలతో అడుగులు వేస్తున్నాయి. ఇది లా ఉండగా గురువారం మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి తీర్మానం పెట్టాలంటూ వైసీపీ కౌన్సిలర్లు ఆర్డీవో, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు.నిడదవోలు మునిసిపాలిటీలో 28 వార్డులకు 2021 మార్చి 15వ తేదీన ఎన్నికలు జరగ్గా 27 వార్డుల్లో వైసీపీ కౌన్సిలర్లు విజయం సాధించగా ఒక వార్డులో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. దీంతో నిడదవోలు కౌన్సిల్ వైసీపీ వశమైంది.ఈ నేపథ్యంలో అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు చైర్మన్ పదవీ కాలాన్ని పంచుకునేలా ఒప్పందం కుదిర్చారు. మొదటి రెండున్నరేళ్లు మునిసిపల్ చైర్మన్‌గా భూపతి ఆదినారాయణ, తరువాత రెండేళ్లు కామిశెట్టి వెంకట సత్యనారాయణ తరువాత మిగిలిన కాలం పువ్వల రతీదేవి చైర్మన్‌గా ఒప్పందం చేసుకున్నారు.ఇదిలా ఉండగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో శ్రీనివాస్ నాయుడు ఓటమిపాలయ్యారు. నిడదవోలు నుంచి జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, చైర్మన్ భూపతి ఆదినారాయణకు మధ్య ఉన్న ఆర్థిక, ఆంతరంగిక వ్యవహారాల కారణంగా ఇద్దరి మధ్య దూరం పెరిగింది.దీంతో భూపతి ఆదినారాయణతో పాటు మరో ఎనిమిది మంది వైసీపీ కౌన్సిలర్లు జనసేన కండువా కప్పుకున్నారు. దీంతో చైర్మన్ ఒప్పందం వివాదం ముదిరి పాకాన పడింది. మునిసిపల్ కౌన్సిల్ ఏర్పడి ఈ నెల 18వ తేదీ నాటికి నాలుగేళ్లు పూర్తవడంతో అవిశ్వాస తీర్మానానికి అవకాశం వచ్చింది. ఇదిలా ఉండగా వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటూ కలెక్టర్ పి.ప్రశాంతి, కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మితలకు గురువారం వినతిపత్రం అందజేశారు. చైర్మన్‌పై అవిశ్వాసానికి తమకు అవకాశం ఇవ్వాలంటూ పలువురు వైసీపీ కౌన్సిలర్లు సంతకాలు పెట్టారు.ఈ నేపథ్యంలో నిడదవోలులో ఎటు చూసినా చైర్మన్ కుర్చీపైనే చర్చ సాగుతోంది.



కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేస్తున్న నిడదవోలు వైసీపీ కౌన్సిలర్లు

నిడదవోలు.. జనసేన వశమయ్యేనా?

నిడదవోలు మునిసిపల్ కౌన్సిల్‌లో చైర్మన్ పదవిని వైసీపీ కైవసం చేసుకోవాలని చూస్తుండగా ఇందుకు జనసేన పార్టీ ఎత్తులకు పైఎత్తులు వేస్తుంది. వైసీపీ ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా జనసేన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. పురపాలక సంఘంలోని 28 మంది కౌన్సిలర్లలో ఒకరు టీడీపీ కాగా మరో తొమ్మిది మంది జనసేన తీర్థం తీసుకున్నారు.మరో 18 మంది వైసీపీలో ఉండగా అవిశ్వాస తీర్మానం నిరూపించు కోవడానికి 19 మంది (2/3) బలం కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం వైసీపీలో ఉన్న 18 మందిలో మరో నలుగురు కౌన్సిలర్లు ఇప్పటికే జనసేనతో జతకట్టి చైర్మన్ కుర్చీని జనసేన ఖాతాలో వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. నిడదవోలు పురపాలక సంఘ కౌన్సిల్‌ను జనసేన ఖాతాలో వేసి మంత్రి కందుల దుర్గేష్‌కు బహుమతిగా ఇచ్చేందుకు నిడదవోలు జనసేన పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది.




ఆకాశమే ఓ అద్భుతం. వానకురిస్తే, మెరుపు మెరిస్తే, హరివిల్లు కనిపిస్తే ఓ అందం. ఉదయమో అందం.. సంధ్య వేళో అందం. రాత్రికి ఆకాశమే ఓ అపురూప దృశ్యం. యానాంలో గౌతమీ గోదావరి తీరాన, యానాం- ఎదుర్లంక వారిధిపైన గురువారం సాయంత్రం కనిపించిన దృశ్యాలివి.... యానాం (ఆంధ్రజ్యోతి)

సంధ్య వేళ.. సొగసుల విందు!

హలీమ్‌కు సలాం!



రంజాన్ మాసంలో హలీమ్ ఘుమఘుమలు
హలీమ్ కోసం క్యూకడుతున్న మాంసాహారప్రియులు



కార్పొరేషన్ (కాకినాడ)/అమలాపురం టౌన్/ కల్చరల్ (రాజమహేంద్రవరం) మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం వచ్చిందంటే.. నోరూరించే రంజాన్ రుచులు అందుబాటులోకి వస్తాయి.. భగభగమండే బట్టీలు, గరంగరం హలీమ్‌తోపాటు నోరూరించే తియ్యని ఖీర్, ఖుర్బానీ మిఠాయి రుచులు రంజాన్ మాసంలో భిన్న వంటకాలు దర్శనమిస్తాయి. మసాలా వాసనలు గుప్పుమంటుంటే ఆటు వైపుగా వెళ్లున్న భోజనప్రియులను అమితంగా ఆకర్షిస్తాయి. కాకినాడ జిల్లాలో తుని, పెద్దాపురం, పిఠాపురం తదితర ప్రాంతాల్లో ఈ హలీమ్ బట్టీలు దర్శనమిస్తున్నాయి. కాకినాడలో భారీ స్థాయిలో హలీమ్ అమ్మకాలు జరుగుతుండడంతో జిల్లా నలుమూలల నుంచి కాకినాడ వచ్చి హలీమ్ రుచి చూడడంతోపాటు కుటుంబ సభ్యులకు, మిత్రులకు పార్శిళ్లు తీసుకెళుతున్నారు. గతంతో పోలిస్తే కాకినాడ నగరంలో నాగమల్లితోట జంక్షన్, జేఎన్టీయూ, భానుగుడి సెంటర్, మసీదు సెంటర్, జగన్నాథపురం వంటి సెంటర్లతోపాటు సుమారు 10 ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేసి అమ్ముతుండగా, కొన్ని రెస్టారెంట్లలో హలీమ్ తయారుచేసి అమ్ముతున్నారు. రంజాన్ మాసం ప్రారంభమయ్యాక హలీమ్ సందడి మొదలవుతుంది. షమీతుక్లా, కద్దుకా ఖీర్ స్వీట్స్‌పాటు మటన్, చికెన్ బిర్యానీ, కిమా సమోసా తదితర వంటకాలు నోరూరిస్తాయి. హలీమ్‌ను మటన్, చికెన్‌తో తయారుచేస్తారు. కాకినాడలో మటన్ హలీమ్ ఫ్యామిలీ ప్యాక్ రూ.400, చికెన్ ఫ్యామిలీ ప్యాక్ రూ.300కు బాగా అమ్ముతున్నారు. ముస్లింలు అధికంగా ఫ్యామిలీ ప్యాక్‌లే తీసుకెళుతున్నారు. ఒక్కో బట్టీ వద్ద రోజుకు సుమారు 150 నుంచి 200 వరకు ఫ్యామిలీ ప్యాక్‌లు ఆర్డర్లుగా అమ్ముడుపోతుండగా, బట్టీల వద్ద రోజుకు సుమారు రెండు వందల మందికి పైగా ఈ వంటకాలు తింటున్నారు. వేకువజామున చేపట్టే ఉపవాస దీక్ష సాయంత్రం విరమించిన అనంతరం ముస్లింలు ఆహారం తీసుకుంటారు. గోధుమ రవ్వ, 15 రకాల మసాలాలతో నోరూరించే విధంగా హలీమ్ తయారు చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఆజాద్ చౌక్ సెంటర్ హలీమ్ విక్రయాలకు అడ్డాగా ఉంది. వందలాది మంది ఇక్కడకు వచ్చి హలీమ్ కొనుగోలు చేస్తున్నారు. ఈ దుకాణాలు రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటున్నాయి. అమలాపురంలో టౌన్ బ్యాంకు వద్ద హలీం సెంటర్ ఏర్పాటుచేశారు.

ఆరోగ్యకరం హలీమ్



హలీమ్ వంటకాన్ని ఇరానీ తరహాలో తయారుచేస్తున్నాం. ఈ వంటకంలో జీడిపప్పు, పిస్తా, శనగపప్పు, మినపప్పు, గోధుమలతోపాటు మటన్, నెయ్యి, పంచదార వంటి ఆరోగ్యకరమైన అధిక ప్రోటీన్లు ఉండే వాటిని వినియోగిస్తున్నాం. ఉదయం 8 గంటలకు హలీం తయారీ ప్రారంభిస్తే సాయంత్రానికి అందుబాటులోకి వస్తుంది. కేవలం నాన్‌వెజ్‌లోనే మటన్ మీట్‌తో హలీంను తయారుచేస్తున్నాం. సింగిల్‌ప్యాక్ రూ.150 కాగా, ఫుల్ ప్యాక్ ధర రూ.200, ఫ్యామిలీ ప్యాక్ రూ.500కు విక్రయిస్తున్నాం. అన్నివర్గాల వారిని హలీమ్ వంటకం ఆకట్టుకుంటోంది.

- మహ్మద్ ఆషిక్‌అలీ (మున్నా), హలీమ్ సెంటర్ నిర్వాహకుడు, అమలాపురం

ఉపవాస దీక్షలో డ్రై ఫ్రూట్స్, పండ్లకు ప్రాధాన్యం

రంజాన్ నెలలో ముస్లింలంతా కఠినమైన ఉపవాస దీక్షలు చేస్తారు. పగలంతా దాహాన్ని కూడా దరికి రానివ్వరు. ఆకలికి చోటివ్వరు. ఆహారపు అలవాట్లలో ప్రత్యేకత చూపిస్తారు. ఈ నెల రోజులు డ్రైఫ్రూట్స్, పళ్లు తీసుకుంటారు. రంజాన్ ఉపవాసదీక్షలు, నమాజ్ ఆధ్యాత్మిక చింతనలతోపాటు ఆరోగ్యానందించి ముస్లింల జీవనాన్ని ఆనందమయం చేస్తాయి. సహరి, ఇఫ్తార్ సమయాల్లో తీసుకునే ఆహారం రోగనిరోధక శక్తి పెంపొందిస్తుంది. మంచి శక్తిని కూడా అందిస్తుంది. దీని ద్వారా ఉపవాస దీక్ష చేస్తున్న వారికి ఆరోగ్యంతోపాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. ఉపవాసం ఉండేవారు తెల్లవారుజామునే అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, పాలు, గోధుమ రుచులు, పెరుగు, మంచినీరు తీసుకుంటారు. డ్రైఫ్రూట్స్ కూడా భుజిస్తారు.



డ్రైఫ్రూట్స్ ప్రయోజనాలు

వంద గ్రాముల జీడిపప్పుతో 596 కేలరీల శక్తినిస్తుంది. బాదంలో 250 కేలరీల శక్తి, 49 శాతం ప్రోటీన్లు ఉంటాయి. ఒక శాతం ఐరన్ లభిస్తుంది. పిస్తాలో 557 కేలరీల శక్తి, 27 గ్రాములు కార్బోహైడ్రేట్స్, 200 గ్రాముల ప్రోటీన్లు లభిస్తాయి. క్రిస్మిస్‌లో 290 కేలరీల శక్తి, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ద్రాక్ష పండ్ల ద్వారా 71 కేలరీల శక్తి లభిస్తుంది. 20 మిల్లీగ్రాముల కాల్షియం, 2.9గ్రాముల పీచు పదార్థం, 15 మిల్లీగ్రాముల ఐరన్ లభిస్తుంది.

ఖర్జూరం ప్రధానం

ముస్లింలు ఖర్జూరాన్ని అధికంగా తీసుకుంటారు. వంద గ్రాముల ఖర్జూరంలో 234 కేలరీల శక్తి, 55 మిల్లీగ్రాముల కార్బోహైడ్రేట్లు, 18 మిల్లీగ్రాముల ప్రోటీన్లు, 76 మిల్లీగ్రాముల పీచు పదార్థాలు, 4 మిల్లీగ్రాముల సోడియం, 60.9 మిల్లీగ్రాముల పొటాషియం, ఐరన్, విటమిన్-బి పుష్కలంగా ఉంటాయి. ధర కిలో రూ.120 నుంచి రూ.180 వరకు ఉంది.

ఖీర్, ఖుర్బానీ మిఠాయి ఆహా..

రంజాన్ మాసంలో ముస్లింలు ఎక్కువగా చేసేది పాయసం. దీనిలో ఎక్కువగా డ్రైఫ్రూట్స్ వేస్తుంటారు. జీడిపప్పు, క్రిస్మిస్, యాలకులు, పిస్తా, బాదం, పంచదార తదితర రకాలు వేసి తయారుచేస్తారు. అందుకే ముస్లింలు చేసే ఖీర్ అంటే చాలా ఇష్టపడతారు. రంజాన్ రోజు ప్రతి ముస్లిం ఇంట ఖీర్, ఖుర్బానీ మిఠాయి ఉండాల్సిందే. ఈ వంటకంలో హిందూ, ముస్లింల ఐక్యత కనిపిస్తుంది. రంజాన్ రోజుల్లో పాల వినియోగం అధికంగా ఉంటుంది.

- కార్పొరేషన్ (కాకినాడ)






వాసు ది గ్రేట్

ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) ఫలితాల్లో జాతీయ స్థాయిలో పదో ర్యాంకు కైవసం

అమలాపురం రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన పిచ్చిక కుమార్‌వాసు గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్)-2025 ఫలితాల్లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పదో ర్యాంకు సాధించాడు. చేనేత కార్మికులైన పిచ్చిక మల్లేశ్వరరావు-రేణుకవాణి కుమారుడు వాసు ఎంతో కష్టపడి గేట్ పరీక్ష రెండో పర్యాయం రాసి పదో ర్యాంకు సాధించాడు. దాంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. వారిని శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఊరేగించి వీరభద్రస్వామి ఆలయం వద్ద ఘనంగా సన్మానించారు. స్థానికులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, గ్రామ పెద్దలు ఉప్పుగంటి భాస్కరరావు, బళ్ల వెంకటేశ్వరరావు, బోళ్ల మల్లేశ్వరరావు, కారుపర్తి భాస్కరరావు, చందన శంకరరావు, మాడా పద్మదుర్గాప్రసాద్, లక్కింశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వాసు తల్లిదండ్రులు మల్లేశ్వరరావు-వాణిలను సత్కరిస్తున్న బండారులంక గ్రామస్తులు

డీఆర్డీవోలో సైంటిస్ట్‌గా పనిచేయడమే లక్ష్యం
పిచ్చిక కుమార్‌వాసు

జాతీయ స్థాయిలో గేట్ పరీక్షలో పదో ర్యాంకు రావడం చాలా ఆనందంగా ఉంది. 1 నుంచి 4వ తరగతి వరకు బండారులంక విజ్‌డమ్ స్కూలులో చదివాను. ఆ తర్వాత భూపతిపాలెం గురుకుల పాఠశాలలో చేరాను. రాజమహేంద్రవరం శ్రీచైతన్యలో ఇంటర్మీడియట్, నర్సరావుపేట జేఎన్టీయూలో బీటెక్ పూర్తి చేశాను. మూడేళ్లపాటు హైదరాబాద్‌లో ఇన్ఫోర్ కంపెనీలో బిజినెస్ ఎనలిస్ట్‌గా పని చేశాను. తర్వాత తమిళనాడులోని ఎన్‌సీఎల్ ఇండియా లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా చేరా. ప్రస్తుతం ఆగ్రాలోని ఇండియన్ ఆయిల్ కంపెనీలో ఏవియేషన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నా. గత ఏడాది గేట్ పరీక్షలో 285వ ర్యాంకు రాగా ఇండియన్ ఆయిల్ కంపెనీలో చేరాను. ఈసారి డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీవో)లో సైంటిస్ట్‌గా పనిచేయడమే లక్ష్యంగా గేట్ పరీక్ష రాశా. పదో ర్యాంకు రావడంతో సైంటిస్ట్‌గా చేరేందుకు మార్గం సుగమం అయ్యింది. నా అభ్యున్నతికి పాటుపడిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు.

ఉగ్రవాదుల నుంచి రక్షణ... పారిశ్రామిక భద్రతకు
సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సైక్లోథాన్ ర్యాలీ



సైక్లోథాన్ ర్యాలీ ప్రతినిధుల బృందానికి మెమెంటో అందజేస్తున్న డీఆర్వో రాజకుమారి

అమలాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల నుంచి దేశాన్ని రక్షించడంతో పాటు పారిశ్రామిక భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు (సీఐఎస్ఎఫ్) సైక్లోథాన్ ర్యాలీ చేపట్టాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎం రాజకుమారి పేర్కొన్నారు. దేశ సమగ్రతను, సమైక్యతను కాపాడుతూ రక్షణ చర్యలపై సముద్ర తీర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం స్ఫూర్తిదాయకమన్నారు. అమలాపురం పట్టణానికి చేరుకున్న సైక్లోథాన్ ర్యాలీని గురువారం ఉదయం గడియార స్తంభంసెంటర్లో జెండా ఊపి పునః ప్రారంభించారు. ర్యాలీ నర్సాపురం మీదుగా మచిలీపట్నం చేరుకుంటుందన్నారు. గుజరాత్ నుంచి చేపట్టిన సైక్లోథాన్ ర్యాలీ కన్యాకుమారి వరకు సాగుతుందన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉగ్రవాదుల చర్యలను దీటుగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తుండడం అభినందనీయమన్నారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాల 56వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు బృందాలుగా సుమారు తీర ప్రాంతం వెంబడి 6,550 కిలోమీటర్ల మేర సైక్లోథాన్ యాత్ర నిర్వహిస్తున్నారన్నారు. అదనపు ఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ దేశ పారిశ్రామిక రక్షణ, ప్రజల రక్షణకు ఈ ర్యాలీ తోడ్పడుతుందన్నారు. గుజరాత్‌లో ఈ నెల 7న కేంద్ర రక్షణ మంత్రి అమిత్‌షా సైక్లోథాన్ ర్యాలీని ప్రారంభించారన్నారు. నెలాఖరునాటికి కన్యాకుమారి చేరుకుటుందన్నారు. బృంద సభ్యులకు మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో దళ డిప్యూటీ కమాండర్ ఏకే ప్రభాకర్, తహసీల్దారు పలివెల అశోక్‌ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు పాల్గొన్నారు.





లూయిస్ బ్రెయిలీ నాణేలు

ఈ నాణేలది ప్రత్యేక భాష!

కంటి చూపు కోల్పోయినా ఆత్మస్థైర్యంతో ముందుకు..
అంధుల కోసం ముద్రించిన నాణేల సేకరణలో ఈమె దిట్ట



రాచకొండ రాజేశ్వరి

అమలాపురం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణానికి చెందిన రాచకొండ రాజేశ్వరి అరుదైన నేత్ర వ్యాధితో కంటి చూపును పూర్తిగా కోల్పోయింది. అప్పటివరకు అందరిలా సాగిన ఆమె జీవనం ఒక్కసారిగా మారిపోయింది. మొదట్లో మానసికంగా కొంత కుంగిపోయినా అంతలోనే తేరుకుని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగింది. ఆమెకు అండగా ప్రముఖ నాణేల సేకరణ కర్త, భర్త పుత్సా కృష్ణకామేశ్వర్ తనవంతు సహాయ సహకారాలు ఆమెకు అందించారు. 2021 కరోనా సమయంలో అరుదైన నేత్ర వ్యాధి రాజేశ్వరికి సోకడంతో ఆమె పూర్తిగా దృష్టిని కోల్పోయింది. ఆమెకు మానసిక ధైర్యాన్ని నింపడంతో అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షురాలిగా పనిచేయడంతోపాటు కోనసీమ మహిళా క్లబ్ నుంచి 2023లో జరిగిన మహిళా దినోత్సవంలో మహిళా అచీవర్ అవార్డును సైతం దక్కించుకున్నారు. మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్‌ను అంతర్జాతీయ స్థాయిలో బెస్ట్‌క్లబ్‌గా నిలిపిన ఘనత రాజేశ్వరికి దక్కుతుంది. ఆ సమయంలోనే ఆమె అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ నాణేలను సేకరించడం ప్రారంభించారు. దేశంలో ఇప్పటి వరకు విడుదలైన రూ.2, రూ.100 బ్రెయిలీ నాణేలతో పాటు బెల్జియం, ఇటలీ దేశాలు విడుదల చేసిన ద్విలోహ నాణేలు, బ్రెయిలీ ముఖ చిత్రంతో విడుదల చేసిన వెండి నాణెం, పలావ్, అమెరికా దేశాలు 2009లో విడుదల చేసిన వెండి నాణేలు, పోలెండ్ దేశం విడుదల చేసిన వెండి నాణేలను సైతం ఆమె సేకరించారు. బ్రెయిలీ నాణేలతో త్వరలోనే ప్రత్యేక ప్రదర్శనలు ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు రాజేశ్వరి తెలిపారు.

సామర్లకోట భీమేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల
ఆదాయం రూ.29.66 లక్షలు

సామర్లకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయానికి మహా శివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.29.66 లక్షలు వచ్చిందని ఈవో బళ్ల నీలకంఠం తెలిపారు. ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ తనిఖీ అధికారి ఫణికుమార్ సమక్షంలో గురువారం తెరిచి లెక్కించారు. హుండీల ద్వారా రూ.16,15,788, దర్శన టిక్కెట్ల ద్వారా రూ.7,05,960, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,12,696, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.2,66,215, వివిధ సేవా టిక్కెట్ల ద్వారా రూ.65,747 లభించాయి. 67 గ్రాముల బంగారు ఆభరణాలు, 600 గ్రాముల వెండి వస్తువులు లభించినట్టు ఈవో తెలిపారు. లెక్కింపులో ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్, జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ఉండూరు శ్రీలక్ష్మీనారాయణ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



హుండీల్లో వచ్చిన సొమ్మును చూస్తున్న దేవదాయ శాఖ తనిఖీ అధికారి ఫణికుమార్

23, 24, 25 తేదీల్లో ఉదయ్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

సామర్లకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే ఇంజనీరింగ్ సెక్షన్ పరిధిలో సామర్లకోట-రావికంపాడు మధ్య ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ నెల 23, 24, 25 తేదీల్లో సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లను తాత్కాలికంగా రద్దు చేసినట్టు రైల్వే పీఆర్వో కార్యాలయం కార్యాలయం నుంచి గురువారం రాత్రి ఉత్తర్వులు అందాయి. 23, 24 తేదీల్లో గుంటూరు నుంచి విశాఖ వెళ్లే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను, 24, 25 తేదీల్లో విశాఖ నుంచి గుంటూరు వెళ్లే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. 22701, 22702 నంబర్లతో గుంటూరు-విశాఖ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 24న రెండువైపులా తాత్కాలికంగా రద్దు చేశారు.

మండే ఎండలో చలచల్లగా...

కరప, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వాకాడ వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లేలేత చిగుర్లు తొడిగిన వృక్షాలు ప్రధాన రహదారిని పచ్చదనంతో ఆవరించి చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఈ రహదారి వెంబడి ఉన్న చెట్ల నీడలో ప్రయాణికులు కొద్దిసేపు బడలిక తీర్చుకుని వెళ్తున్నారు. ఎండలు ముదురుతున్న తరుణంలో ఈ రహదారిపై ప్రయాణం ఆహ్లాదభరితంగా ఉంటోందని పలువురు ప్రయాణికులు చెప్తున్నారు.





కరప-వాకాడ ప్రధాన రహదారిపై పరుచుకున్న పచ్చదనం

కాటేజీలు.. ఇక పరిశుభ్రంగా..

● సత్యదేవుడి సన్నిధిలో సత్రం గదుల నిర్వహణపై ఈవో దృష్టి

● మరమ్మతులు, పారిశుధ్య బాధ్యతలు ఏఈఈవోలకు అప్పగింత

● ఒక్కో సత్రానికి ఒక్కొక్కరి చొప్పున విభజన



ప్రకాష్‌సదన్ కాటేజీ

అన్నవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో భక్తులు బస చేసేందుకు వివిధ సత్రం గదులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో చాలావరకు దశాబ్దాల క్రితం నిర్మించినవే. కొండపైన న్యూసెంటినరీ, పాతసెంటినరీ, సీతారామ, హరిహరసదన్, శివసదన్ పేర్లతో 450 గదులు ఉంటాయి. శివసదన్ ఒక్కటే రెండేళ్లక్రితం ప్రారంభించారు. మిగిలిన సత్రం గదుల్లో పలు గదులు మరమ్మతులకు గురవడం, శానిటేషన్ సంతృప్తికరంగా లేకపోవడంతో భక్తుల నుంచి విమర్శలు వినిపించేవి. శానిటేషన్, స్వల్ప మర మ్మతుల నిర్వహణ ప్రైవేట్ సంస్థకు టెండర్‌ద్వారా కేటాయించి శానిటేషన్ బాధ్యతలు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు మాత్రమే కేటాయించేవారు.

బాధ్యతల అప్పగింత

తాజాగా సత్రం గదుల పారిశుధ్య నిర్వహణ, మరమ్మతుల పర్యవేక్షణకు దేవస్థానంలో ఉన్న ఏఈవోల్లో ఒక్కో సత్రం బాధ్యత ఒక్కో ఏఈవో కు అప్పగించారు. కొండదిగువన ఉన్న సత్యనికేతన్ సత్రం బాధ్యతలు సూపరింటెండెంట్ ఐవీ రామారావుకు అప్పగిస్తూ ఈవో వీర్ల సుబ్బారావు ఆదేశాలిచ్చారు. వీరంతా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసి గదులన్నీ భక్తులకు కేటాయించాలనే ల క్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇప్ప టికే కొండదిగువన ఉన్న సత్యనికేతన్ సత్రంలో ఐవీ రామారావు దృష్టిసారించి కాటేజీకి సంబందించి ఎలక్ట్రికల్, ప్లంబింగ్, మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. సత్రం గుమస్తాలు ఏ గదిలో మరమ్మతులు ఉన్నాయో చూసి సంబంధిత కాటేజీకి అప్పగించిన వారికి సమాచారం చేరవేస్తే ఆ ఏఈవో వాటిని త్వరితగతిన పని పూర్తి చేయిస్తారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూకరత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు అన్ని కాటేజీల పారిశుధ్య నిర్వహణపై పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. దీంతో సత్యదేవుడి సన్నిధిలో ఉన్న సత్రం గదులకు మహర్దశ పట్టి గదులన్నీ పూర్తి సౌకర్యాలతో నిండి ఉంటాయని అనడంలో సందేహం లేదు.

నేడు సత్యదేవుడి నూతన ఆలయ నిర్మాణ.. పునఃప్రారంభ దినోత్సవం

● అన్నవరంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్న పండితులు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి నూతన ఆలయ నిర్మాణం పునః ప్రారంభించి శుక్రవారంతో 13ఏళ్లు పూర్తిచేసుకుని 14వఏట ప్రవేశించబోతోంది. శిథిలావస్థకు చేరిన పాత ఆలయంలో మూలవిరాట్‌లను కదపకుండా పూర్తిగా గ్రానైట్‌తో అప్పటి ఈవో, ప్రస్తుత దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ కృషితో సాధ్యమైంది. ఈ విషయంలో పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించి గుడి పునర్నిర్మాణం నిలుపుదల చేయాలని ఎత్తులు వేశారు. దీనిపై రామచంద్రమోహన్ అలుపెరగని పోరాటం చేశారు. 2010లో పాత ఆలయ గోడలు తొలగించి యంత్రాలయం ఆవరణలో బాలాలయం నిర్మించి స్వామికి ఉన్న శక్తినంతటనీ మంత్రపూర్వకంగా కలశాల్లో నింపి భక్తుల దర్శనాలకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యవహరించారు. 2012లో ఫాల్గుణ బహుళ సప్తమి రోజున కంచికామకోటి పీఠాధిపతి కలశప్రతిష్ఠ గావించారు. అప్పట్నించి ప్రతిఏటా ఫాల్గుణ బహుళ సప్తమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గర్భాలయంలో ఉన్న మూలవరులకు లక్షపత్రిపూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు అవసర నివేదనలు శాస్త్రోక్తంగా చేపట్టనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్, సీఐ వెంకట నారాయణ, ఎస్ఐలు

అప్పులబాధ తాళలేకే..

» పిల్లలను చంపి తాను ఆత్మహత్యకు పథకం...

» మనస్సుమార్చుకుని రాథేయపాలెం బంధువుల ఇంటికి

» బంధువుల సూచనతో పోలీసుల ఎదుట లొంగుబాటు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు శివారు గణపతినగరంవద్ద తన కన్నబిడ్డలను కాలువలోకి తోసి కుమార్తె కారుణ్యశ్రీ (7) మృతికి కారణమైన తండ్రి పిల్లి రాజు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీంతో రామచంద్రపురం సీఐ ఎం.వెంకటనారాయణ పిల్లి రాజును అరెస్టు చేశారు. గురువారం రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలను వెల్లడించారు. రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు అప్పుల బాధతాళలేక తన కుమారుడు రామ్‌సందీప్(10), కుమార్తె కారుణ్యశ్రీ(7)లను చంపి తాను ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నాడు. ఈనెల 17న మధ్యాహ్నం ఒంటిగంటకు తన పిల్లలు చదువుతున్న భాష్యం పాఠశాల నుంచి మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని నెలపర్తిపాడు శివారు గణపతినగరంవద్ద ఇంజరం కాలువలోకి ఇద్దరు పిల్లలను తోసేశాడు. కుమారుడు ఈదుకుంటూ తుప్పలను పట్టుకుని ఒడ్డుకుచేరుకోగా కుమార్తె కారుణ్యశ్రీ కాలువలో మునిగి మరణించింది. పిల్లి రాజు తన మోటారు సైకిల్‌పై పరారయ్యాడు. కుమారుడు ఇచ్చిన సమాచారంతో ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదుచేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పిల్లి రాజు ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. బుధవారం రాజు మోటారు సైకిల్ యానాం వారధిపై గుర్తించడంతో గోదావరిలో కూడా గాలింపు చర్యలు చేపట్టారు. పిల్లి రాజు ఆత్మహత్య చేసుకోవాలని యానాం చేరుకున్నాడు. అనంతరం మనస్సు మార్చుకుని రాజానగరం మండలం రాథేయపాలెం బంధువుల ఇంటికి చేరుకున్నాడు. బంధువుల సూచనతో మండపేటరూరల్ పోలీసులకు పిల్లి రాజు లొంగిపోయాడు. ద్రాక్షారామ పోలీసులు రాజును అరెస్టుచేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ ఎం.వెంకటనారాయణ, ద్రాక్షారామ, రామచంద్రపురం ఎస్ఐలు లక్ష్మణ్, నాగేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు.

పిఠాపురంలో జనసేన వీర మహిళపై కేసు నమోదు

పిఠాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేతతో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు ముఖ్యనేతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పిఠాపురం పట్టణానికి చెందిన జనసేన వీరమహిళ సుజాతపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడజిల్లా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని చిత్రాడ శివారులో ఈనెల 14న జనసేన ఆవిర్భావ సభ జరిగిన తీరుపై ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులనుద్దేశించి సుజాత అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు వాటిని సోషల్ మీడియాలో పోస్టుచేసింది. జ్యోతిప్రజ్వలనకు కొందరినే ఆహ్వానించడం తదితర అంశాలపై ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దీంతో రెండు రోజుల క్రితం జనసేన నాయకులు పిఠాపురం సీఐ శ్రీనివాస్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం కేసునమోదు చేసిన పిఠాపురం పట్టణ పోలీసులు రాత్రి సుజాత ఇంటికి వెళ్లారు. రాత్రి కావడంతో స్టేషన్‌కు రావాలని చెప్పి వెళ్లిపోయారు. ఇప్పటివరకు ఆమెను అరెస్టుచేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ జనసేన నాయకులు మరోమారు సీఐని కలిశారు.

ఫిలిం డిస్ట్రిబ్యూటర్ రాము ఆకస్మిక మృతి


ఆకుల రాము

అమలాపురం టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫిలిం డిస్ట్రిబ్యూటర్‌గా దశాబ్దాల కాలంగా వ్యవహరిస్తున్న ఆకుల రాము (62) గురువారం ఉదయం ఆకస్మికంగా గుండెపోటుతో మృతిచెందారు. సినిమా పంపిణీ రంగంలో ఎవరు ఏ సినిమా కొనాలన్నా ముందుగా రామును సంప్రదించేవారు. సినిమా రంగానికి రాము చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని పలువురు పేర్కొన్నారు. అమలాపురం నల్లవంతెన దిగువన ఉన్న మెట్ల కాలనీలో ఆయన నివాసంలోనే రాము గుండెపోటుతో మృతిచెందడంతో సినీ అభిమానులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాక్టర్ కింద పడి గిరిజనుడి మృతి

కూనవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కోతులగుట్ట గ్రామంలో చోటుచేసుకుంది. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కొంతమంది గిరిజనులు పోచవరం కాలనీ మిర్చికోతల పనులకు నెలరోజుల క్రితం వచ్చారు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో వారు ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్నారు. ఈలోగా కోతులగుట్టలో ట్రాక్టర్ టైరు పేలడంతో ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చున్న ముచ్చిక ఎర్ర(30) అకస్మాత్తుగా కింద పడిపోయారు. దీంతో ఎర్రపై నుంచి ట్రాక్టర్ చక్రాలు వెళ్లిపోవడంతో ఎర్ర అక్కడికక్కడే మృతిచెందాడు. అన్న సీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నాడు. మృతుడిది ఛత్తీస్‌గడ్ రాష్ట్రం సుకమాజిల్లా బాబినపల్లి గ్రామం.

23న రాజమహేంద్రవరంలో ప్రాంతీయ విద్యాసదస్సు

● ఏపీయూటీఎఫ్ పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ



ఏపీయూటీఎఫ్ పోరుబాట పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళా కేంద్రంలో ఈనెల 23న ఐదు జిల్లాల ప్రాంతీయ విద్యాసదస్సు జరుగుతుందని ఏపీయూటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ వెల్లడించారు. గురువారం రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ హోంలో జిల్లా కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశానికి జయకర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ పోరుబాటలో భాగంగా ప్రాంతీయ విద్యా సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులో తూర్పుగోదావరి జిల్లాతోపాటు పశ్చిమగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాల నుంచి పెద్దఎత్తున ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. రాష్ట్ర యూటీఎఫ్ నాయకత్వం ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. యూటీఎఫ్ కార్యకర్తలు మండలస్థాయిలో సర్వే నిర్వహించి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌కు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ జీవో 117 రద్దు, పాఠశాలల విలీనాలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల రూ.25,000 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు విజయగౌరి, ఈవీఎస్ఆర్ ప్రసాద్, శ్రీమణి, దయానిధి, శ్రీనివాస్, రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, శ్రీనివాసమూర్తి, వెంకటరమణ, సత్యనారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.25.32లక్షలు


అయినవిల్లి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వర స్వామివారి దేవస్థానంలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 51 రోజులకుగాను ఆలయ ప్రధాన హుండీల నుంచి రూ.24,45,779 నగదు, అన్నప్రసాద హుండీ నుంచి రూ.86,484 నగదుతో కలిపి రూ.25.32లక్షల ఆదాయం వచ్చిందన్నారు. 14 విదేశీ కరెన్సీ నోట్లు హుండీలో గుర్తించామన్నారు. దేవదాయశాఖ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు హుండీల ఆదాయాన్ని లెక్కించారు.

జీజీహెచ్‌లో మరో జీబీఎస్ కేసు నమోదు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మరో గులియన్-బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైంది. జీబీఎస్ బారిన పడిన ముగ్గురు బాధితులు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. లావణ్యకుమారి గురువారం తెలిపారు. జీబీఎస్ కేసులకు వైద్య చికిత్స, మందులు, వ్యాక్సిన్, మౌలిక సదుపాయాలు జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో అందు బాటులో ఉన్నాయని ఆమె చెప్పారు.

వివాహేతర సంబంధం కోసం తండ్రినే మట్టుబెట్టింది!

● ప్రియుడితో కలసి హతమార్చిన కుమార్తె

● పోలీసుల దర్యాప్తులో వెల్లడైన దారుణం

● కుమార్తె సహా మరో ఇద్దరు అరెస్టు

● మండపేటలో ఘటన



తండ్రిని ప్రియుడితో కలిసి హత్యకు పాల్పడిన కుమార్తె అమె ప్రియుడిని ఆరెస్టుచేసిన మండపేట సీఐ సురేష్

మండపేట, మార్చి20 (ఆంధ్రజ్యోతి): తన వివాహేతర సంబంధానికి కన్నతండ్రి అడ్డుతగులుతున్నాడని, తండ్రినే ప్రియుడితో కలిసి కుమార్తె హత్యకు పాల్పడిన దారుణమిది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణ సీఐ దారం సురేష్ తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల అనుమానాస్పద స్థితిలో సురా రాంబాబు మరణించాడు. ఈ కేసును ఛేదించిన పోలీసులు చివరకు అతని కుమార్తె, ఆమె ప్రియుడు హత్య చేసినట్టు తేల్చారు. సూరా రాంబాబు కుమార్తె వస్త్రాల వెంకటదుర్గకు రామచంద్రపురం పట్టణం సమీపంలో ఉన్న కొత్తూరు గ్రామానికి చెందిన ముమ్మిడివరపు సురేష్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయమై తండ్రి మందలించడంతో ఆమె తన తండ్రిపై కసిపెంచుకుంది. ఈనెల 16వ తేదీ రాత్రి తన పిల్లలను తల్లి వద్ద పడుకోబెట్టిన దుర్గ తన తండ్రి ఒంటరిగా పడుకున్నాడని తన ప్రియుడు ముమ్మిడివరపు సురేష్‌కు సమాచారం చెప్పింది. దీంతో అతడు తన స్నేహితుడు అదే గ్రామానికి చెందిన తాటికొండ నాగార్జునతో కలిసి మండపేటకు వచ్చి గాఢనిద్రలో ఉన్న రాంబాబు ఛాతీపై కూర్చుని పీకనులిమి చంపి పారిపోయారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుల కోసం గాలిస్తుండగా రామచంద్రపురం నుంచి విశాఖకు పారిపోయేందుకు సిదమవుతున్న వారిని రామచంద్రపురంలో అదుపులోకి తీసుకుని ఆరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని సీఐ తెలియజేశారు. మండపేట పట్టణంలో ఈనెల 16న మేదరపేటకు చెందిన సురా పండు తన అన్నగారైన రాంబాబు అనుమానాస్పదంగా మరణించాడని పట్టణ పోలీసులకు చేసిన ఫిర్యాదుమేరకు ఈ కేసును దర్యాప్తు చేసినట్టు పట్టణ సీఐ తెలిపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలమేరకు రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ నేతృత్వంలో కేసును ఛేదించి గురువారం ఈ కేసులో ముగ్గురు నిందితులను ఆరెస్టుచేశామని తెలిపారు. కోర్టు రిమాండ్ విధించగా వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

రైలు నుంచి జారిపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

● మృతురాలిది ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్


మృతిచెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుభాష్ మితా దాస్

సామర్లకోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తూ కిందికి జారిపడడంతో తలకు బలమైన గాయమై ఒడిసా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ మహిళా ఉద్యోగి దుర్మరణం పాలయిన సంఘటన గురువారం సామర్లకోట రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జి.మేడపాడు స్టేషన్‌వద్ద జరిగింది. ప్రమాద సమయంలో కొన ఊపిరితోఉన్న సదరు యువతిని రైల్వే ఉద్యోగులు గుర్తించి వెనుకనే సామర్లకోట వైపునకు వెళుతున్న సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు లో హుటాహుటిన తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు 108 వైద్య సిబ్బంది గుర్తించా రు. వివరాల్లోకి వెళితే ఒడిసా రాష్ట్రం కేంద్ర పారాజనావళి, కలాస్‌పూర్‌కు చెందిన శిబా ప్రసాద్ దాస్ కుమార్తె అయిన సుభాష్ మితా దాస్ (25) బెంగళూరులోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. తల్లిదండ్రుల వద్దకు వెళ్లేందుకు బుధవారం బెంగుళూరులో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్ టిక్కెట్టు ద్వారా ప్రయాణించేందుకు రైలు ఎక్కింది. రైలు గురువారం సామర్లకోట సమీపాన జీ.మేడపాడు చేరేసరికి బోగీ తలుపువద్ద నిలుచుని ఉన్న మితాదాస్ ప్రమాదవశాత్తూ కిందికి తూలి పడింది. తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందింది. బోగీలోఉన్న మితాదాస్ లగేజీని పలాసవద్ద రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహంవద్ద లభించిన ప్రాథమిక సమాచారంతో భువనేశ్వర్‌లో ఉన్న తండ్రికి సామర్లకోట రైల్వేపోలీసులు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ఆసుపత్రికి తరలించి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

● భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు

● కోటనందూరులో ఘటన..


ట్రాక్టర్ చక్రాలకిందపడి మృతి చెందిన వెంకటేశ్వర్లు

కోటనందూరు, మార్చి20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి-కాకరాపల్లి మార్గంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద గురువారం ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లిజిల్లా నాతవరం మండలం చినగొలుగండపేటకు చెందిన కాళ్ల వెంకటేశ్వర్లు(59), బర్ల వరలక్ష్మి టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్ ద్విచక్రవాహనంపై కోటనందూరులో సామాన్లు కొనుక్కోవడానికి వెళుతున్నారు. అదే దారిలో ధాన్యం లోడుతో అతివేగంగా వెళుతున్న గునిపూడికి చెందిన ట్రాక్టర్ పక్కనుంచి ఢీకొట్టడంతో వీళ్లిద్దరూ కింద పడిపోయారు. వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందగా బర్లవరలక్ష్మికి తీవ్రగాయాల య్యాయి. ఆమెను 108 అంబులెన్స్‌లో నర్సీపట్నంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

బైక్ ప్రమాదంలో చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి

మారేడుమిల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బైక్అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన సంఘటనలో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి తీవ్రగాయాలు పాలయ్యాడు. ఈ సంఘటన మారేడుమిల్లి మండలం దేవరపల్లి సమీపంలో చోటుచేసుకుంది. రంపచోడవరం మండలం రాకోటకు చెందిన కామేశ్వరరెడ్డి తన కుటుంబంతో మారేడుమిల్లి మండలంలోని జీఎం వలస గ్రామానికి తన కుటుంబంతో కలిసి శుభకార్యానికి వెళ్లి వస్తుండగా దేవరపల్లి సమీపంలో ఒక మలుపువద్ద చెట్టును బలంగా ఢీ కొట్టాడు. దీంతో హంసగీత(4)అక్కడికక్కడే మృతి చెందగా మరో చిన్నారి నిఖిత వర్షిణి గాయాలపాలైంది.ఈప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కామేశ్వర రెడ్డిని రంపచోడవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై మారేడుమిల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూనవరం రుద్రమ్మకోట రేవు వేలంపాట రూ.78.60లక్షలు


వేలంపాట నిర్వహిస్తున్న ఈవో సురేష్‌కుమార్

కూనవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కూనవ రం రుద్రమ్మకోట పడవ రేవు వేలంపాట రూ.78. 60లక్షలు పలికింది. వేలేరుపాడు మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన బీరబోయిన కోటేశ్వరరావు ఈపాటను దక్కించుకున్నారు. గత ఏడాది రూ.80లక్షలు పాట పలకగా ఈఏడాది రూ.78.60లక్షలు పలికింది. కూనవరం పంచాయతీ కార్యాలయంలో ఈ పాట నిర్వహించారు. ఈకార్యక్రమంలో కూనవరం, రుద్రమ్మకోట సర్పంచ్‌లు హేమంత్, లలితకుమారి, ఎంపీటీసీ అనంతలక్ష్మి, వైస్ఎంపీపీ బండారు సాంబశివరావు, ఎంపీడీవో రామాంజనేయప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్, కూనవరం మేజర్ పంచాయతీ ఈవో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

గుండెపోటుతో కువైట్‌లో గొందివాసి మృతి


కువైట్‌లో గుండెపోటుతో మృతిచెందిన చింతా సాగర్

అంతర్వేది, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం గొంది గ్రామానికి చెందిన చింతా సాగర్(34), 18వ తేదీన కువైట్ దేశంలో గుండెపోటుతో మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. రెండు రోజులకు కువైట్ దేశం నుంచి సాగర్ పనిచేస్తున్న శేర్ ఫోన్‌చేసి వివరాలు తెలిపినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సాగర్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. 2022లో కువైట్ దేశం వెళ్లిన సాగర్ 2024 జనవరిలో వచ్చి తిరిగి మళ్లీ జూలై నెలలో వెళ్లినట్టు తెలిపారు. జీవనోపాధి కోసం వెళ్లిన సాగర్ మరలా తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు సాగర్‌కు గుండెపోటు వచ్చిందన్న మరణవార్త విని ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కువైట్ దేశంలో డ్రైవింగ్ చేసుకుంటూ నిద్రమత్తులోనే గుండెపోటుతో మరణించిన సాగర్ మృతదేహం శనివారం స్వగ్రామానికి వస్తుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కరప, మార్చి 20(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కరప ఎస్ఐ తోటసునీత తెలిపారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సీతారామపురం గ్రామానికి చెందిన సాధన(28)కు ఎనిమిదేళ్ల క్రితం కరప మండలం పెద్దాపురప్పాడు గ్రామ శివారు వై.సావరానికి చెందిన కోరం రాజశేఖర్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. వివాహమైనప్పటి నుంచీ రాజశేఖర్ సాధనను అనుమానిస్తూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీ రాత్రి వారిద్దరి మధ్య గొడవ జరిగింది. భర్త వేధింపులు భరించలేక సాధన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. అప్పటి నుంచీ కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారంరాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సునీత తెలిపారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

రేపు ఆర్ట్స్ కళాశాలలో మెగా జాబ్‌మేళా

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 22న సంకల్ప మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో సంకల్ప జాబ్‌మేళా పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, 25 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళీ జాబ్‌మేళా వివరాలు మాట్లాడుతూ ఆసక్తి కల్గిన నిరుద్యోగ యువత నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్ యూజర్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అవసరమైన అర్హతాపత్రాలతో అభ్యర్థులు శనివారం రోజు ఉదయం 9.30గంటలకు హాజరుకావాలని చెప్పారు.

నటభూషణ్ శోభన్‌బాబుకు ఘన నివాళి


శోభన్‌బాబు విగ్రహానికి గజమాల వేసి నివాళులు

రాజమహేంద్రవరం కల్చరల్,మార్చి 20(ఆంధ్రజ్యోతి): నటభూషణ్ 17వ వర్ధంతిని పురస్కరించుకుని, శోభన్‌బాబు సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం గోదావరి బండ్ రోడ్‌లో ఉన్న శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సేవా సమితి గౌరవ అధ్యక్షుడు అల్లు బాబీ మాట్లాడుతూ శోభన్‌బాబు తన విలక్షణమైన నటనతో తెలుగు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. ఈ సందర్భంగా గౌతమీ జీవకారుణ్య సంఘంలోని చిన్నారులతోపాటు వేయి మందికి అన్నదానం చేశారు. కాగా శోభన్‌బాబు వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ శోభన్‌బాబు సేవా సమితి మహిళా విభాగం అధ్యక్షురాలు బత్తుల వరలక్ష్మి ప్రచురించిన పత్రికను సభ్యులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కొనగళ్ల శ్రీనివాసరావు, పూడి శ్రీనివాస్ కుమార్, యనమల రంగబాబు, బళ్లా శ్రీనివాస్, సోగ్గాడు ప్రసాద్, ఎం.సత్యనారాయణ, మొతికి సత్యనారాయణ, స్వాతిప్రకాష్ పాల్గొన్నారు.

మద్దూరి అన్నపూర్ణయ్య జయంతి


ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయుడు మద్దూరి అన్నపూర్ణయ్య త్యాగధనుడని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, అశోక్‌కుమార్ జైన్ కొనియాడారు. మద్దూరి అన్నపూర్ణయ్య 126వ జయంతి సందర్భంగా మద్దూరి అన్నపూర్ణయ్య సేవా సమితి ఆధ్వర్యాన గురువారం స్థానిక జండా పంజా రోడ్‌లోని మద్దూరి అన్నపూర్ణయ్య పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రకాశంనగర్‌లోని ధర్మంచర కమ్యూనిటీ హాల్‌లో జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణయ్య జీవితానికి సంబంధించిన కీలక ఘట్టాలతో శ్రీపాద శ్రీనివాస్ రూపొందించిన బ్రోచర్‌ను రౌతు ఆవిష్కరించారు. అనంతరం వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని అవార్డు, పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో పసుపులేటి కృష్ణ, ఎ.సత్యనారాయణ, పి.వీరబాబు, ఎన్.శేషగిరి, బీఎస్ఎన్ఎల్ సాయి బాబా, పిల్లాడి శ్రీనివాస్, అబ్దుల్లా షరీఫ్, బుడ్డిగ రవి పాల్గొన్నారు.

వీసీ ప్రసన్నశ్రీకి శక్తి ప్రేరణ సమ్మాన్ అవార్డు

దివాన్‌చెరువు, మార్చి20 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన భారతి మహిళా విభాగంలోని శక్తి మహిళా స్వచ్ఛంధ సంస్థ ఆంధ్ర విభాగం ఆంధ్ర శక్తి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సాతుపటి ప్రసన్నశ్రీకి శక్తి ప్రేరణ సమ్మాన్ అవార్డును ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర శక్తి రాష్ట్ర కోఆర్డినేటర్ వనపల్లి పద్మావతి, సభ్యులు వీసీని సన్మానించి అవార్డును ప్రదానం చేశారు. 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించి భాష పరిరక్షణకు చేసిన కృషికి గుర్తింపుగా, ఆంధ్ర శక్తి 22వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును ప్రసన్నశ్రీకి ఈ అవార్డు అందచేసినట్టు ఆంధ్రశక్తి సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా ప్రసన్నశ్రీ మాట్లాడుతూ మహిళా సాధికారతకు స్వచ్ఛంధ సంస్థలు కృషి చేయాలన్నారు. భవిష్యత్‌లో మహిళలకు సంబంధించిన కార్యక్రమాలను విశ్వవిద్యాలయంతో కలసి సంయుక్తంగా నిర్వహించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం మహిళా విభాగ కోఆర్డినేటర్ ఆచార్య పి.ఉమామహేశ్వరీదేవి, ఎన్.సజన్‌రాజ్, ఆంధ్ర శక్తి సభ్యులు సుష్మప్రియ, సుజాత, గౌరీపార్వతి, రాజరాజేశ్వరీదేవి తదితరులు పాల్గొన్నారు.

రచనలు అమ్మకు అంకితమివ్వాలి

నన్నయ విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాలలో ఆర్థికశాస్త్ర విభాగం విద్యార్థిని జి.రాణిశ్రీ అమ్మ ప్రేమను వర్ణిస్తూ రాసిన పాటను గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆలపించి వీసీ ప్రసన్నశ్రీకి అంకితం చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాణిశ్రీకి ఉన్న రచనాసక్తిని, లోతైన భావంతో అమ్మ ప్రేమను వర్ణించిన విధానాన్ని అభినందించారు. రచనలన్నీ గ్రంథస్థం చేసి జన్మనిచ్చిన అమ్మకు అంకితమివ్వాలన్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం కూచింపూడి గ్రామంలోని పెదఅచ్చయ్య, పుల్లమ్మ దంపతుల కుమార్తె రాణిశ్రీ నన్నయ వర్శిటీలో ఎంఏ ఆర్థికశాస్త్రం రెండో సంవత్సరం చదువుతూ రచనపై ఆసక్తిని పెంచుకుందన్నారు. అమ్మ, నాన్న, స్నేహితులు, ప్రకృతి వంటి అంశాలపై కవితలు రాయడం హర్షనీయమన్నారు. రాణి రచనాసక్తిని గుర్తించి ఆమెను ప్రోత్సహించాలని వీసీ కోరారు.

నోటి ఆరోగ్యంతోనే శారీరక, మానసిక ఆరోగ్యం

వరల్డ్ ఓరల్ హెల్త్ డేలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామగురెడ్డి


అనపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యుల బృందం

అనపర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ నోటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, దానిపైనే శారీరక, మానసిక ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని అనపర్తి ఏరి యా ఆసుపత్రి సూపరిండెంట్ డా క్టర్ తాడి రామగురెడ్డి అన్నారు. గురువారం వరల్డ్ ఓరల్ హెల్త్‌డే సందర్భంగా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా డెంటల్ సర్జన్ డాక్టర్ సీహెచ్ఎస్ భాగ్యలక్ష్మి సేవలందించారు. అనంతరం నోటి ఆరోగ్యంపై మెయిన్‌రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు పద్మశ్రీ, తరుణ్, కోటేశ్వరి, అమృత, చారి, సరోజిని, హెచ్‌డీసీ సభ్యుడు దాకే దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: దంత సంరక్షణ, ఆరోగ్య సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి డెంటల్ సర్జన్ డాక్టర్ విశ్వనాథ్ అన్నారు. గురువారం ప్రభుత్వ బోధనాసుపత్రి చిన్నపిల్లల విభాగం డైస్ సెంటర్లో నోటి ఆరోగ్య దినోత్సవం (ఓరల్ హెల్త్ డే) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ తప్పనిసరిగా రెండుసార్లు దంతాలు తోముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిల్లల తల్లిదండ్రులకు నోటి పరిశుభ్రత గురించి వివరించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర, డాక్టర్ ఇంద్రజ, డాక్టర్ క్రాంతి, డెంటల్ హైజనిస్ట్ డాక్టర్ సూర్యవర్మ, డైస్ సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరు వరకు సాగునీరు విడుదల

టీపీ స్కీమ్ చైర్మన్ వేగి శ్రీనివాస్

సీతానగరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపట్నంలో తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకం నుంచి ఈ నెలాఖరు వరకు సాగునీరు విడుదల చేయనున్నట్టు టీపీ స్కీం చైర్మన్ వేగి శ్రీనివాస్ తెలిపారు. గురువారం రఘుదేవపురంలో తొర్రిగడ్డ పంపింగ్ స్కీం ఏఈ ఎస్.శివరామకృష్ణ ఆధ్వర్యంలో టీపీ స్కీం చైర్మన్ వేగి శ్రీనివాస్ అధ్యక్షతన పాలకవర్గం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ అర్ధరాత్రి నుంచి సాగునీటి విడుదల నిలిపివేసి జూన్ 10న తిరిగి ఖరీఫ్‌కు సాగునీటి విడుదల చేసేందుకు పాలకవర్గం తీర్మానం చేసిందన్నారు. క్యార్యక్రమలో వైస్ చైర్మన్ శ్రీమందపాటి, జగపతిరాజు, కోనే శ్రీనివాస్, నిడదవోలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి దశ సూత్రాలను ఆచరించాలి

సత్యసాయి వ్రతావధాని రఘుపతి

అనపర్తి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి సూచించిన దశ సూత్రాలను ఆచరించడం ద్వారా ప్రతి ఒక్కరూ దివ్యమైన జీవితాన్ని పొందవచ్చని సత్యసాయి వ్రతావధాని యడవల్లి రఘుపతి మాస్టారు అన్నారు. గురువారం మండలంలోని పీరా రామచంద్రపురంలో సత్యసాయి సామూహిక వ్రతాలను ఆచరించారు. ఈ సందర్భంగా రఘుపతి భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. షిరిడీ సాయి, సత్యసాయి, ప్రేమ సాయి అవతార వైభవంపై అవగాహన పెంపొందించుకుని వారు సూచించిన సూక్తులను ఆచరిస్తూ ఆధ్యాత్మిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్లు నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, సాయిరామారెడ్డి, బులుసు వెంకటేశ్వర్లు, సర్పంచ్ తేతలి సుధాకరరెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డితోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 12 గంటలకు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్ర కుమార్ తెలిపారు. చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. దీనికి 23 వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

భూసంస్కరణలు అమలు చేయాలి

ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారుడు అయినాపురపు


సమావేశంలో మాట్లాడుతున్న అయినాపురపు సూర్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూసంస్కరణలు అమలు చేసి సీలింగు చట్టప్రకారం 50శాతం భూమి ఎస్సీ ఎస్టీలకు పంపిణీ చేయాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 34,349 ఎకరాల సీలింగ్ మిగులు భూములు ఉన్నా యని వాటిలో 15,500 ఎకరాలు పంపిణీ జరిగిందని అప్పటి తూ ర్పుగోదావరి జిల్లా కలెక్టర్ సీసీఎస్‌యూ నివేదిక పంపారని తెలిపారు. సుమారు 18848 ఎకరాలు కోర్టులో వివాదంలో ఉన్నాయని కోనేరు రంగారావు భూ కమిటీ నివేదించిందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రారంభించిన భూ పంపిణీ కార్యక్రమంలో పంచిన సీలింగ్ భూములు వెయ్యి ఎకరాల లోపే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు బాధ్యత వహించి సీలింగ్ భూ ములన్నీ వేరే పార్టీకి రిజిస్ట్రేషన్స్ జరుగకుండా 22ఎ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న 18,848 ఎకరాల విషయమై సత్వర చర్యలు తీసుకొని కోర్టు లిటికేషన్ నుంచి తప్పించి పంపిణీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రౌతులపూడి మండలంలో 50 ఏళ్లుగా వివాదంలో ఉందని, అయితే తహశీల్దార్ డిజిటల్ పట్టాదారు పాస్ పుస్తకాలు ఈ ఏడాది ఫిబ్రవరిలో మంజూరు చేశారని, దానిపై ప్రభుత్వం విచారణ జరిపి తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత ఆదివాసీ మహాసభ వ్యవస్థాపకుడు, భారత రాజ్యాంగ సభ సభ్యుడు జైపాల్‌సింగ్ ముండా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో ఆదివాసీ మహాసభ సభ్యులు జక్కల పాండవులు, గూన అప్పన్న, అర్జున్న, మల్లేశ్వరి, చీడిపల్లి లక్ష్మణ, గొలగాని నూకాలమ్మ, చంద్రావతి పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల ఆర్థిక బలోపేతానికి చర్యలు

కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు



ఎస్సీ మహిళలకు డబ్బాలను అందజేస్తున్న నాయుడు

రాజానగరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల ఆర్థిక పురోభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు పేర్కొన్నారు. మండలంలో కలవచర్లలోని కేవీకేలో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక-రైతులు, రైతు మహిళలకు గురువారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్రం షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికను అమలు చేస్తోందని, దీనిలో భాగంగా అందించే పరికరాలను రైతులు, సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పశుసంవర్ధక అధికారి బి.నాగేశ్వరరెడ్డి, నికోబారి, శ్రీనిధి, ఆసిల్ కోళ్ల జాతులను, బ్లాక్ బెంగాల్ పొట్టి మేకల జాతిని ప్రదర్శనగా చేపట్టి, వాటిని తక్కువ ఖర్చుతో పెంచే పద్ధతులను వివరించగా, సస్యరక్షణ అధికారి రఘునందన్ వంగ, అరటి రకాలను ప్రదర్శించారు. అలాగే గృహ విజ్ఞానాధికారి సంజయ్ హెగ్డే పచ్చి, పండు పనసకాయలతో చేయగలిగే విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో కేవీకే అధికారులు విజయ్‌వర్ధన్, రత్నాజీ, గొల్లప్రోలు, కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన 50 మంది రైతులు, రైతు మహిళలు పాల్గొన్నారు.

మానవ హక్కుల చట్టాలపై అవగాహన ఉండాలి

మానవ హక్కుల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొడ్డిపాటి దాసు



సదస్సులో పాల్గొన్న బొడ్డపాటి దాసు, తదితరులు

గోకవరం, మార్చి20(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల చట్టాలపై ప్రతిఒక్కరికి పూర్తి అవగాహన ఉండాలని మానవ హక్కుల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొడ్డపాటి దాసు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సమాచార హక్కు సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రజలు మానవ హక్కులపై అవగాహన కల్గి చట్టానికి లోబడి మసులుకోవాలన్నారు. మహిళల పట్ల జరుగుతున్న వివక్ష వంటి అంశాలపై పలువురు ప్రసంగించారు. రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే తమ దృష్టికి తీసుకొస్తే బాధితులకు న్యాయం చేసేవరకు పోరాడతామన్నారు. ఇదిలా ఉండగా గోకవరంలోని ప్రభుత్వాసుపత్రిని బొడ్డపాటి దాసు, మానవ హక్కుల ఫౌండేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసెడెంట్ కె.ఇందిరా, జాతీయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఝాన్సీ తదితరులు సందర్శించారు. ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న సేవలను వైద్యాధికారిణి వనజాకుమారిని అడిగి తెలుసుకుని, వైద్యం అందుతున్న తీరు తెన్నులపై రోగులను ఆరాతీసారు. కార్యక్రమంలో సమాచార హక్కు సంఘం జాతీయ అధ్యక్షుడు సుమిత్రానందన్, రాజానగరం, జగ్గంపేట కన్వీనర్లు కరాసు శివరామకృష్ణ, బత్తిన రాజు, డ్వాక్రా మహిళలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి

ఆర్డీవో కృష్ణనాయక్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పేదలు ఆక్రమించుకుని గృహ నిర్మాణం చేపట్టిన నివాస యోగ్యమైన స్థలాల ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆక్రమణలను క్రమబద్ధీకరించుకునేవారు తమ దరఖాస్తులను గ్రామ/వార్డు సచివాలయాల్లో అందజేయాలన్నారు. అర్హత కల్గిన లబ్ధిదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది జనవరి 29 నుంచి అమల్లోకి వచ్చిన చట్టం ప్రకారం స్థలాల క్రమబద్ధీకరణకు 2019 అక్టోబరు 10వ తేదీకి కానీ, అంతకుముందు కానీ ఈ చట్టం వర్తిస్తుందని ఆయన తెలిపారు.

21 వాహనాలు.. రూ.1.6 లక్షలు

బిక్కవోలు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను గురువారం తహశీల్దార్ సత్యకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వేలం నిర్వహించారు. రికార్డులు లేని వాహనాలను, సీజ్ చేసిన వాటిలో తిరిగి తీసుకువెళ్లని వాహనాలకు వేలం నిర్వహించగా 43 మంది పాల్గొన్నారన్నారు.వేలంలో 17 ద్విచక్రవాహనాలు, మూడో ఆటోలు, ఒక షిఫ్ట్ డిజైర్ కారు ఆరుగురు వ్యక్తులు రూ.1.60 లక్షలకు పాడుకున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

దొంగకు ఏడాది జైలు

రాజమహేంద్రవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో దొంగతనాలు చేస్తున్న ఓ వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించింది. బొమ్మూరు సీఐ కాశీ విశ్వనాథం తెలిపిన వివరాల ప్రకారం.. తాము ఇంట్లోలేని సమయంలో ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి బంగారు వస్తువులు, నగదు దోచుకున్నారని 2023లో బొమ్మూరుకు చెందిన వడ్డాది శ్రీనివాస రామచంద్ర ఆనంద ప్రకాశ్ ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా కొంతమూరుకు చెందిన కొండేటి సాయిని నిందితుడిగా గుర్తించారు. ఈ కేసుతోపాటు గతంలో ఐదు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడంటూ కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో సదరు కేసుల్లో ఏకకాలంలో ఏడాది జైలు విధిస్తున్నట్టు కోర్టు గురువారం తీర్పు ఇచ్చిందని సీఐ తెలిపారు.

రెల్లీల రిజర్వేషన్‌ను 3 శాతానికి పెంచాలి


రాజానగరంలో నిరసన తెలియజేస్తున్న రెల్లి కులస్తులు

రాజానగరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులస్తులకు ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్‌ను 3శాతానికి పెంపుచేయాలంటూ రాజానగరంలో గురువారం రెల్లీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుల పెద్దలు పలువురు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు తాము వ్యతిరేకులం కాదని, అయితే వర్గీకరణతో రెల్లీలకు తీవ్ర అన్యాయం జరుగుతుంద న్నారు. 1శాతమే కేటాయించడం వల్ల విద్య, ఉద్యోగాల్లో, రాజకీయంగా లబ్ధి పొందలేకపోతామన్నారు. పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంటుందన్నారు. కనీసం 3 శాతానికి పెంచే దిశగా ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అలాగే రెల్లి కులస్థుల్లో బేడ, బుడగ జంగాలను కలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రెల్లిల సంక్షేమ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ ముత్యాల సుబ్రహ్మణ్యం, బొచ్చా రవి, గొర్రిపర్తి సతీష్, బంగార్రాజు, నీలాపు శ్రీనివాస్, సంగంరెడ్డి సత్తిపండు, నీలాపు సత్తిరాజు, భవాని, వీరపండు, నాని ప్రసాద్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

25న బిక్కవోలు మండల పరిషత్ సమావేశం

బిక్కవోలు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న బిక్కవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బుద్దాల కన్నారావు అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.శ్రీనివాస్ గురువారం తెలి పారు. సమావేశంలో 2025-26కు సంబంధించిన అంచనా బడ్జెట్ ప్రవేశపెడతామని, మండల స్థాయి అధికారులందరూ తగిన సమాచారంతో హాజరు కావాలని పేర్కొన్నారు.

26న రంగంపేటలో..

రంగంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 2.00గంటలకు రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో వి.వి.సాయిబాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రంగంపేట మండలం 2024-25 సవరణ బడ్జెట్, 2025-26 అంచనా బడ్జెట్ ఆమోదం కోసం సమావేశం నిర్వహిస్తున్నామని, మండల స్థాయి అధికారులందరూ ఈ సమావేశానికి తమ శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికతో హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

29న సీతానగరంలో..

సీతానగరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 29వ తేదీ ఉదయం 11గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.భారతి గురువారం తెలిపారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరుగుతుందన్నారు. సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ మండల స్థాయి శాఖాధికారులు ,పంచాయతీ కార్యదర్సులు విఆర్వోలు తప్పని సరిగా పాల్గొనాలని ఆమె పేర్కొన్నారు.

నేడు బీసీ కులవృత్తి సంఘాలకు సమావేశం

రాజానగరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆదరణ-3 పథకం అమలు ప్రక్రియలో భాగంగా బీసీ కులాలకు చెందిన కుల వృత్తి సంఘాలతో ఈ నెల 21న మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు వృత్తికారులకు అవసరమైన ఆధునిక పనిముట్లు, నాణ్యత పరంగా పేరుగాంచిన కంపెనీలు/ ఏజెన్సీల ద్వారా అందజేసేందుకు, ఆయా వృత్తిదారులకు ఏయే పనిముట్లు కావాలి, పంపిణీదారుల నుంచి సమాచారం సేకరించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 3న సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, బీసీ కుల వృత్తి సంఘాల నాయకులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం తాడితోట సంహిత డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో వ్యోమగామి సునీత విలియమ్స్‌కు హార్ధిక స్వాగతం పలుకుతూ భారీ ర్యాలీ చేశారు. గురువారం తాడితోట సెంటర్‌లో మానవహారంగాను, ర్యాలీ చేసి సునీతా విలియమ్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.బాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సీహెచ్ రామకృష్ణ, ఎస్కేపీ భాను, పి.హర్షిత సునందిని, వలంటీర్లు పాల్గొన్నారు.

వాహన ఫిట్‌నెస్ టెస్ట్‌లు పాతవిధానంలోనే చేయాలి

రాజానగరంలో వాహన యజమానుల ఆందోళన


ఏటీఎస్ సెంటర్ వద్ద ఆందోళన చేస్తున్న వాహనదారులు

రాజానగరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వాహనాల ఫిట్‌నెస్ టెస్టులను పాత విధానంలో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వాహన యజమానులు రాజానగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)వద్ద గురువారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులు మాట్లాడుతూ గతంలో ఫిట్‌నెస్ టెస్టింగ్ రాజమహేంద్రవరం ఆర్టీవో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించేవారని, ప్రస్తుతం ఏటీఎస్‌ను ప్రైవేటుకు కట్టబెట్టడంతో వసూళ్లమయమైందన్నారు. వాహన స్థాయిని బట్టి రేటు నిర్ణయించి, వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలో రూ.670 ఉన్న ఫీజు ప్రస్తుతం రూ.1300 అయ్యిందన్నారు. వాహనాల ఫిట్‌నెస్ సమయంలో సంబంధిత యజమానిని దగ్గర ఉండనివ్వడం లేదన్నారు. దీనికి తోడు జిల్లా వ్యాప్తంగా ఉన్న వాహనదారులంతా ఫిట్‌నెస్ టెస్టింగ్ కోసం రాజానగరం రావాల్సి వస్తుందని, వాహనదారులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పునరాలోచన చేసి, పాత పద్ధతిలోనే ఆర్టీవో అధికారుల పర్యవేక్షణలో కొనసాగించేలా చర్యలు చేపట్టాలని వాహనాల యజమానులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఎలగాలమ్మ జాతరకు 'కంబాల' ఆర్థిక సాయం


సాయం అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు

కోరుకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగట్ల గ్రామదేవత ఎలగాలమ్మ వార్షిక జాతర గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని విశ్వహిందూ ధర్మ పరిరక్షన రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి జాతర నిర్వహణకు రూ.30 వేలు కమిటీ సభ్యులకు అందజేశారు. పేదల సంక్షేమం కోసం 18రకాల ఉచిత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ గోకవరం మండ అధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, వరుసాల ప్రసాద్, బత్తుల నానాజీ, మేడిశెట్టి శివరాం, పచ్చారి నరసింహమూర్తి, చింతల దేవి కన్నారావు, ఉంగరాల మణిరత్నం, మీసాల నాగార్జున, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకు నగరంలో చలివేంద్రాలు

మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ప్రజల దాహార్తిని తీర్చేందుకు నగరంలో పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం వడగాలుల తీవ్రత పెరుగుతున్నందున నగరంలో ప్రజలు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నగరంలో పుష్కరాల రేవు, కంబాలచెరువు, హెడ్ వాటర్ వర్కర్స్ ప్రాంతాల్లో దాహన్ని తీర్చేందుకు ఉచితంగా తాగునీరు అందుబాటులో ఉంచామన్నారు. గోకవరం బస్టాండ్, దేవీచౌక్ కూడలి, పేపరుమిల్లు, కోరుకొండ రోడ్డు, మామిడిపళ్ల మార్కెట్, క్వారీ మార్కెట్ కూడలి, లాలాచెరువు జంక్షన్ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా ప్రజలకు తాగునీరు అందిచనున్నామన్నారు. నగరంలో ఎన్‌వోలు, స్వచ్ఛంధ సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలనుకునే వారు ముందుగా నగరపాలక సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్ నెంబరు 98499 08350ను సంప్రదించి అనుమతి తీసుకోవాలని కమిషనర్ చెప్పారు.

కలప పట్టివేత

గోకవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతం వైపుకు అక్రమంగా తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నట్టు గురువారం ఇందుకూరు రేంజ్ అధికారి కొండలరావు తెలిపారు. రంపచోడవరం డీఎఫ్‌వో అనూషకు ముందుగా అందిన సమాచారం మేరకు బుధవారం రాత్రి గస్తీ నిర్వహించగా ఐషర్ వ్యాన్‌పై తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన కలప విలువ సుమారు రూ.70,000 ఉంటుందని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 21 మార్చి 2025 | 5





బాలచంద్రుడి వేషధారణలో మంత్రి దుర్గేష్



చంద్రబాబుతో యనమల కరచాలనం

ఆడేశా.. కబడ్డీ

మద్దతుగా మన మహిళా నేతలు

హై..హై..నాయకా!

కూటమి నాయకులను ఒక వైపే చూశాం.. రెండో వైపు చూడలేదు.. గత మూడు రోజులుగా అదీ చూపించారు. అమరావతి కేంద్రంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనల్లోనూ తమ సత్తా చాటారు. బుధవారం కబడ్డీ పోటీల్లో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నువ్వా నేనా అంటూ తలపడ్డారు. 60 ఏళ్లు పైబడిన కేటగిరీలో వంద మీటర్ల విభాగంలో తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. గురువారం పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ బాలచంద్రుడి ఏకపాత్రాభినయంలో ద్వితీయ బహుమతి కొట్టేశారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మ్యూజికల్ చైర్స్‌లో ప్రథమ బహుమతి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ క్యారమ్స్‌లో ప్రథమ బహుమతి, టెన్నికాయిట్ డబుల్స్‌లో విన్నర్‌గా నిలిచారు.



హలీమ్.. సలాం!

చూస్తే నోరూరుతోంది.. ఏడాదికి ఒక్కసారైనా తినాలనిపిస్తుంది.. ఎందుకంటే ముస్లింల వంటకం మరి.. ఆరోగ్యం.. బలమైన ఆహారం.. రంజాన్ మాసం సందర్భంగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నగరాల్లో జనం ముందుకు వచ్చేసింది.. జనం కూడా ఎగబడుతున్నారు.. 15 రకాల మసాలాలతో తయారు చేసే హలీమ్‌కు సలామ్ కొడుతున్నారు.. 8

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:20 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:45 (శనివారం ఉదయం)



రియల్..లాస్!

ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల రాబడికి గండి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మంత్రదండాన్ని బయటకు తీసినా ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల శాఖ లక్ష్యాన్ని సాధించడం అసాధ్యంగా కనిపిస్తోంది.2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపునకు ఇంకా 10 రోజులు మాత్రమే సమయం ఉంది. జిల్లాలో ఇంకా 70 శాతం లక్ష్యాన్ని కూడా ఆ శాఖ చేరుకోలేదు. వాస్తవానికి ఐదు నెలల నుంచీ రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగుతున్నాయి. కారణాలేమైనప్పటికీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ దశలోనూ రిజిస్ట్రేషన్లు పుంజుకోడానికి అధికారులు చొరవ చూపలేదనే విమర్శలు వినవస్తున్నాయి. జిరాక్సు కాపీలు ఇస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన అయోమయంలో నెలలు గడిచిపోవడం,మరోవైపు రియల్ ఎస్టేటు రంగం కుదేలు కావడం కూడా రాబడి ని తగ్గించిందని చెబుతున్నారు.జిల్లాలో నత్తనడ కన సాగుతున్న రిజిస్ట్రేషన్లపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

ఆదాయానికి గండి

రిజిస్ట్రేషన్ల ఆదాయానికి జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం భారీ గండి పడింది. గత నవంబరు నుంచీ రిజిస్ట్రేషన్లు నత్తన డకన సాగుతున్నాయి.గతేడాది ఎన్నికల సంవత్సరం కావడంతో కాస్త ఇబ్బంది ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన కార్డ్‌ప్రైం 2.0 లోని సమస్యలు దానికి తోడయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుదు రుకోడానికి సాధారణంగానే సమయం పట్టింది.ఆ సమయంలో రిజిస్ట్రేషన్ల శాఖ కూడా పెద్దగా పట్టింపులేకుండా పని చేసింది.దీంతో గత నవంబరు నుంచీ రిజిస్ట్రేషన్లలో తీవ్ర మందగమనం నడుస్తోంది.జనవరి నెలలో సంక్రాంతి పండుగ సందర్భంగా రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరుగుతుంటాయి.కానీ ఈ జనవరి దానికి భిన్నంగా ఫలితాలను ఇచ్చింది.ఫిబ్రవరి 1 నుంచీ భూముల ధరలు కాస్త పెరగడం కూడా ప్రభావం చూపింది. వివిధ రకాల కారణాలతో రియల్ ఎస్టేట్ పడకేసింది. దీంతో రిజిస్ట్రేషన్ల ఆదాయం భారీగా తగ్గింది.మార్చి 31ని ముం దుకు జరిపితే తప్ప ఏమి చేసినా ఈ ఏడాది లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యమనే చెప్పవచ్చు.

- ముగుస్తున్న ఆర్థిక సంవత్సరం
- మరో 10 రోజులే గడువు
- ఇంకనూ పూర్తికాని లక్ష్యం
- 64 శాతమే రిజిస్ట్రేషన్లు
- ఈ ఏడాది లక్ష్యం రూ.70 కోట్లు
- కేవలం రూ.45 కోట్లే ఆదాయం
- లక్ష్యానికి చేరువగా అనంతపల్లి
- దూరంగా వేగేశ్వరపురం
- కష్టంగా మారిన లక్ష్య సాధన
- నవంబరు నుంచి నత్తనడక
- గత వైసీపీ 2.0నే కారణం
- నేటికీ కోలుకోని తీరు
- మందకొడిగా లావాదేవీలు

జిల్లాలో రిజిస్ట్రేషన్లు ఇలా..

ఎస్ఆర్‌వో	లక్ష్యం(లక్షల్లో)	20వ తేదీకి	శాతం
అనపర్తి	2319.01	1688.05	72.79
అనంతపల్లి	3166.16	2820.39	89.08
బిక్కవోలు	2644.40	1893.14	71.59
కడియం	5955.22	3637.60	61.08
కోరుకొండ	3203.80	1619.30	50.54
కొవ్వూరు	5759.41	4180.24	72.58
నిడదవోలు	4488.22	2866.70	63.87
పిడింగొయ్యి	7165.07	4732.48	66.05
రాజమహేంద్రవరం	23034.97	15121.71	65.65
రాజానగరం	9421.49	4938.15	52.41
సీతానగరం	982.62	678.15	69.01
వేగేశ్వరపురం	2003.99	917.35	45.78
మొత్తం	70144.36	45093.26	64.29

70 శాతానికీ.. చేరుకోలేదు

ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల ఆదాయం లక్ష్యాన్ని ఛేదించడం మాట అలా ఉంచితే కనీసం 70 శాతాన్ని అందుకోలేకపో యింది. ఈ ఆర్థిక ఏడా ది లక్ష్యం రూ.70 కోట్లు కాగా రూ.45 కోట్లు దాటి నెమ్మదిగా అడుగులు వేస్తోంది. జిల్లాలోని రిజిస్ట్రేషన్ల శాఖకు ప్రధాన ఆదాయ వనరు లుగా చెప్పుకోదగిన కడియం,రాజమహేంద్రవరం,రాజానగరం, పిడింగొయ్యి సబ్-రిజిస్ట్రారు కార్యాలయాలు పూర్తిగా నిరాశ పరి చాయి. లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఈ పది రోజుల్లో రాజమహేంద్రవరం 8 కోట్లు,కడియం రూ.2.40 కోట్లు, పిడింగొయ్యి రూ.2.30 కోట్లు, రాజానగరం రూ.5 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. ఇది సాధ్యమయ్యే పనికాదని అధికారులు సైతం చేతులెత్తేస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం రాబడిలో మొదటి మూడు స్థానాల్లో అనంతపల్లి, అనపర్తి, కొవ్వూరు ఉండగా వేగే శ్వరపురం చివరి స్థానంలో ఉంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ కొద్ది రోజులుగా జిల్లాపై దృష్టి సారించినా ఫలితాలు ఆశాజనకంగా కనిపించకపోవడం గమనార్హం.

ఎండ తీవ్రతపై దృష్టి పెట్టండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత పెరిగి వడగాడ్పులు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో గురువారం క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో వడగాలులు తీవ్రత దృష్ట్యా ఉదయం రెవెన్యూ డివిజనల్ అధికారులు, సాయంత్రం మండల,మునిసిపల్ అధికారుల సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి నిర్దిష్టకార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు చలివేంద్రాల ద్వారా చల్లని నీరు సరఫరా చేయాలన్నారు. ఒంటిపూటబడుల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఉపాధి కూలీలు పనిచేసే చోట్ల నీడ ఉం డేలా టెంట్లు ఏర్పాటు చేసి తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచా లన్నారు. వేసవి దృష్ట్యా ఐస్ ఫ్యాక్టరీలపై తనిఖీలు చేయాలన్నారు. వడగాలుల కార ణంగా అనారోగ్యం పాలై మరణాలు సంభవిస్తే 24 గంటల్లో నివేదిక అందజేయాలన్నారు.పాఠశాలల విషయంలో ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు నెంబరు 9398580029కు ఫిర్యాదు చేయ్యవచ్చని తెలిపారు.

ఈ సమావేశంలో కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీవీ గిరి, డీపీవో వి.శాంతా మణి, డీఈవో ఎస్.వాసుదేవరెడ్డి, డీఎల్‌డీవో వీణాదేవి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో సమీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఎండలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలోని వైద్యాధికారులు కార్యాచరణ ప్రణాళికతో సంసిద్ధం కావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వర రావు అన్నారు. జిల్లావైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం జిల్లా ప్రోగ్రాం అధికారులు, వైద్యసిబ్బందితో సమీక్షించారు. ఉదయం 11 గంటలకే బయటి పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లినప్పుడు వాంతులు, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే అవి వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జే.సంధ్య, కంటి వెలుగు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లావణ్య, డిప్యూటీ డెమో డాక్టర్ సత్యకుమార్, డాక్టర్ మౌనిక, సీహెచ్‌వో జాన్సన్, శర్మ, డాక్టర్ నిశాంత్, షమ్మీకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దగూడెంలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలి

గోపాలపురంలో కలెక్టర్

గోపాలపురం, మార్చి20 (ఆంధ్రజ్యోతి) :డయేరియా పూర్తిగా అదుపులో ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.గోపాలపురం మండలం పెద్దగూడెంలో గురువారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు.సత్యసాయి పథకం తాగునీరు సరఫరా చేస్తున్న రక్షిత మంచినీటి ట్యాంకులను పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు శుద్ధిచేసిన తాగునీటిని సరఫరా చేయాలన్నారు. నీటినమూనాలు పరిక్షించడం, వాటర్ ట్యాంకుల క్లోరినేషన్ చేయడం శుద్ధి చేసిన జలాలను ప్రజలకు అందించడం సాధ్యమవుతుందన్నారు. స్టోరేజ్ ట్యాంకుల పై మూతలు ఉంచడం, నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపించి పరీక్షించడం తప్పనిసరిగా చేయాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఆమె వెంట మెడికల్ ఆఫీసర్ రాజీవ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అజయ్‌బాబు,ఏఈ బంగారయ్య, కార్యదర్శి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ గళం

బలభద్రపురంలో 200 కేన్సర్ కేసులు

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అనపర్తి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామాన్ని కేన్సర్ మహమ్మారి నుంచి కాపాడాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం అసెంబ్లీలో కోరారు. బిక్కవోలు మండలం బలభద్రపురంలో సుమారు 200 మంది కేన్సర్‌తో బాధపడుతున్నారని సుమారుగా 30 మంది పైగా కేన్సర్ బారిన పడి మరణించారన్నారు.ఈ పరిస్థితి అంతుపట్టకుండా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రాసిమ్ ఇండస్ట్రీని ఏర్పాటు చేసిన నాటి నుంచి గ్రామంలో ఆరోగ్య సమస్యలు పెరిగాయన్నారు. ప్రభుత్వం శ్రద్ధ వహిం చి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులను కాపాడాలన్నారు.పర్యావరణ, వైద్య ఆరోగ్య శాఖలు దృష్టి సారించాలని సభను కోరారు.

సమానత్వమే లక్ష్యంగా ఎస్సీ వర్గీకరణ

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



గోపాలపురం,మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలన, సమానత్వమే లక్ష్యంగా ఎస్సీ వర్గీకరణ చేశారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణపై ఆయన మాట్లాడారు.ఉపకులాల మధ్య ఉన్న అభిప్రాయాలు తీసుకుని ఏ,బీ,సీ,డీ వర్గీకరణకు సభలో ఆమోదం తెలపడం గర్వంగా ఉందన్నారు.1984లో టీడీపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తే ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు సాంకేతిక పరిజ్ఞానంతో పాఠశాల లను మరింత అభివృద్ధి చేశారన్నారు. నా ఉన్నత చదువులకు సాంఘిక సం క్షేమ గురుకులాలు దోహదపడ్డాయన్నారు.



రాజానగరంలో విద్యుత్ సమస్యలు

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పూర్తిగా గాలికొదిలేసిందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అసెంబ్లీలో తన గళాన్ని వినిపించారు. ప్రధానంగా నియోజకవర్గంలో లైన్‌మెన్ల కొరత వేధిస్తుందన్నారు. నియోజకవర్గంలో 73 ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల్లేక, 1851 చోట్ల వీధి లైట్లు లేక ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైసీపీ పాలనలో 350 అగ్రికల్చర్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గతంలో డ్యామేజ్ జరిగిన చోట్ల రీప్లేస్ చేయడానికి మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను గత పాలకులు రియల్ ఎస్టేట్‌లో ఉపయోగించుకున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు.అనంతరం మంత్రి లోకేశ్‌ను కలిసి రాజానగరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు, కోరుకొండ,రాజానగరాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని విన్నవించారు.దీనిపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారని బత్తుల తెలిపారు.



గ్రామస్తుల సమస్యలు వింటున్న పోలీసులు

4240 మందికి రూ.6.19 కోట్లు

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహనిర్మాణానికి అదనపు సహాయం కింద 4240 మంది లబ్ధిదారులకు రూ. 6.19 కోట్లు విడుదల చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా గురువారం రాత్రి క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి ఎఫ్‌టీవో విడుదల చేసి పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 21,584 మంది ఎస్సీ ఎస్టీ బీసీలకు చెందిన గృహనిర్మాణ పనులు పూర్తి చేయవలసి ఉందన్నారు.అదనపు సహాయం కింద ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీజీటీ (ట్రైబ్స్)కు రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ 8540 మంది లబ్ధిదారులకు సమాచారం ఇచ్చి క్షేత్రస్థాయిలో 8477 మందిని కలసి మార్గదర్శకాలు వివరించినట్టు చెప్పారు.ఆర్థిక సహాయం పొందిన వారిలో ఎస్సీలు 1724, బీసీలు 2413, ఎస్టీలు 112మంది ఉన్నారన్నారు. ఇది రాష్ట్రంలోనే మొదటి స్థానం అన్నారు. 5678 మంది ఇంటి నిర్మాణానికి ముందుకు వచ్చారన్నారు.

పోలీస్.. పల్లెనిద్ర..

తొర్రేడులో ప్రారంభం

రాజమహేంద్రవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులు ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో పల్లెనిద్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. అడిషనల్ ఎస్పీ (శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు బుధవారం రాత్రి తొర్రేడు గ్రామంలో నిద్రించారు. అంతకు ముందు ప్రధాన కూడళ్లలో ప్రజలకు ఇవాళ సమాజంలో జరుగుతున్న నేరాలతీరు, అప్రమత్తంగా ఉండే విధానంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాల వల్ల దుష్పరిణామాలు, డయల్ 112, శక్తి యాప్ తదితర అంశాలపై చైతన్యం చేశారు. గ్రామ పెద్దలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.ఆయన వెంట సీఐ వీరయ్య గౌడ్,ఎస్ఐ మనోహర్ ఉన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు.ఆయా స్టేషన్ల అధికారులు గురు వారం రద్దీ కూడళ్లు, పాఠశాలలు, కళా శాలలకు వెళ్లి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి.రిజిస్ట్రేషను చేయించడంతో పాటు వినియోగంపై శిక్షణ ఇచ్చారు.

నిడదవోలులో వేడెక్కిన రాజకీయం

- చైర్మన్‌పై అవిశ్వాసానికి రెడీ
- వైసీపీ కౌన్సిలర్ల ముందడుగు
- కలెక్టర్,ఆర్‌డీవోలకు విన్నపం
- ఈ నెల 18కి నాలుగేళ్లు పూర్తి
- పట్టు బిగిస్తున్న జనసేన
- ఇప్పటికే కూటమిలో 10 మంది
- జనసేనలోకి మరో నలుగురు?
- మారుతున్న పరిణామాలు

నిడదవోలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మునిసిపాలిటీలో రాజకీయం ఒక్కసారి వేడెక్కింది..కౌన్సిల్ సభ్యులు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఎలాగైనా సరే చైర్మన్ కుర్చీని కైవసం చేసుకోవాలని అటు వైసీపీ, వైసీపీని చిత్తుగా ఓడించాలని జనసేన వ్యూహ ప్రతివ్యూహాలతో అడుగులు వేస్తున్నాయి. ఇదిలా ఉండగా గురువారం మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి తీర్మానం పెట్టాలంటూ వైసీసీ కౌన్సిలర్లు ఆర్డీవో, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు.నిడదవోలు మునిసిపాలిటీలో 28 వార్డులకు 2021 మార్చి 15వ తేదీన ఎన్నికలు జరగ్గా 27 వార్డుల్లో వైసీపీ కౌన్సిలర్లు విజయం సాధించగా ఒక వార్డులో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. దీంతో నిడదవోలు కౌన్సిల్ వైసీపీ వశమైంది.ఈ నేపథ్యంలో అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు చైర్మన్ పదవీ కాలాన్ని పంచుకునేలా ఒప్పందం కుదిర్చారు. మొదటి రెండున్నరేళ్లు మునిసిపల్ చైర్మన్‌గా భూపతి ఆదినారాయణ, తరువాత రెండేళ్లు కామిశెట్టి వెంకట సత్యనారాయణ తరువాత మిగిలిన కాలం పువ్వల రతీదేవి చైర్మన్‌గా ఒప్పందం చేసుకున్నారు.ఇదిలా ఉండగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో శ్రీనివాస్ నాయుడు ఓటమిపాలయ్యారు. నిడదవోలు నుంచి జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, చైర్మన్ భూపతి ఆదినారాయణకు మధ్య ఉన్న ఆర్థిక, ఆంతరంగిక వ్యవహారాల కారణంగా ఇద్దరి మధ్య దూరం పెరిగింది.దీంతో భూపతి ఆదినారాయణతో పాటు మరో ఎనిమిది మంది వైసీపీ కౌన్సిలర్లు జనసేన కండువా కప్పుకున్నారు. దీంతో చైర్మన్ ఒప్పందం వివాదం ముదిరి పాకాన పడింది. మునిసిపల్ కౌన్సిల్ ఏర్పడి ఈ నెల 18వ తేదీ నాటికి నాలుగేళ్లు పూర్తవడంతో అవిశ్వాస తీర్మానానికి అవకాశం వచ్చింది. ఇదిలా ఉండగా వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటూ కలెక్టర్ పి.ప్రశాంతి, కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మితలకు గురువారం వినతిపత్రం అందజేశారు. చైర్మన్ పై అవిశ్వాసానికి తమకు అవకాశం ఇవ్వాలంటూ పలువురు వైసీపీ కౌన్సిలర్లు సంతకాలు పెట్టారు.ఈ నేపథ్యంలో నిడదవోలులో ఎటు చూసినా చైర్మన్ కుర్చీపైనే చర్చ సాగుతోంది.



కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేస్తున్న నిడదవోలు వైసీపీ కౌన్సిలర్లు

నిడదవోలు.. జనసేన వశమయ్యేనా?

నిడదవోలు మునిసిపల్ కౌన్సిల్‌లో చైర్మన్ పదవిని వైసీపీ కైవసం చేసుకోవాలని చూస్తుండగా ఇందుకు జనసేన పార్టీ ఎత్తులకు పైఎత్తులు వేస్తుంది. వైసీపీ ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా జనసేన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. పురపాలక సంఘంలోని 28 మంది కౌన్సిలర్లలో ఒకరు టీడీపీ కాగా మరో తొమ్మిది మంది జనసేన తీర్థం తీసుకున్నారు.మరో 18 మంది వైసీపీలో ఉండగా అవిశ్వాస తీర్మానం నిరూపించు కోవడానికి 19 మంది (2/3) బలం కావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం వైసీపీలో ఉన్న 18 మందిలో మరో నలుగురు కౌన్సిలర్లు ఇప్పటికే జనసేనతో జతకట్టి చైర్మన్ కుర్చీని జనసేన ఖాతాలో వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. నిడదవోలు పురపాలక సంఘ కౌన్సిల్‌ను జనసేన ఖాతాలో వేసి మంత్రి కందుల దుర్గేష్‌కు బహుమతిగా ఇచ్చేందుకు నిడదవోలు జనసేన పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది.

అస్పృశ్యత నిర్మూలనకు అంబేద్కర్ ఎనలేని కృషి



4వ వార్డులో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పట్టణ సీఐ విశ్వం

కొవ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అస్పృశ్యత నిర్మూలన, సమానత్వం కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎనలేని కృషి చేశారని దళిత నేత బొంతా శ్యాంరవిప్రకాష్ అన్నారు. 98వ మహద్ చెరువు పోరాటాన్ని పురస్కరించుకుని పట్టణంలోని 4వ వార్డులో గురువారం అంబేద్కర్ విగ్రహానికి పట్టణ సీఐ పి.విశ్వం పూలమాలవేసి నివాళి అర్పించారు. శ్యాంరవిప్రకాష్ మాట్లాడుతూ 1927 మార్చి 20వ తేదీన అంబేద్కర్ మహద్ చెరువులోని మంచినీళ్ల తాగేందుకు షెడ్యూల్ కులాలతో త్యాగపూరితమైన పోరాటం చేశారన్నారు. ఆ పోరాటాలతో సాధించిన హక్కులనే నేడు మనమంతా అనుభవిస్తున్నామన్నారు.

రాష్ట్రప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలి



ఆందోళన చేస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు, మహిళలు

కొవ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని ప్రగతిశీల మహిళాసంఘం జిల్లా నాయకురాలు ఈమని మల్లిక డిమాండ్ చేశారు. కొవ్వూరు పట్టణంలో గురువారం పీవోడబ్ల్యూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌సిక్స్ అమలు, అలాగే రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలన్నారు. ఈ తొమ్మిది నెలల కాలంలో 80 మంది మహిళలు, బాలికలు అత్యాచారాలు, హత్యలకు గురయ్యారన్నారు. మహిళలపై జరుగుతున్న లైంగిక హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకులు ఎం.రత్న, ఎం. సాయికుమారి, భవాని, జి. పార్వతి, ఎం. బేబీరాణి, పి.సత్యవతి, హరిత, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పరిరక్షణ సమితి సభ్యుల సమావేశం



కొవ్వూరు సమావేశంలో పాల్గొన్న రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు

కొవ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొవిడ్‌కు ముందు ఆగే రైళ్లకు హాల్ట్ కల్పించాలని రైల్వే పరిరక్షణ సమితి చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటిగా ఫలిస్తున్నట్టు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు వీటీ విల్సన్‌బాబు, వైకే శ్రీనివాస్ తెలిపారు. గురువారం కొవ్వూరు రైల్వేస్టేషన్ వద్ద పరిరక్షణ సమితి సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 2019 నాటి హాల్ట్‌లను తిరిగి పునరుద్ధరించాలని చేస్తున్న ప్రయత్నాలకు రైల్వేశాఖ స్పందించకపోవడంతో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం ద్వారా హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. రైల్వేశాఖ వాయిదాలను కోరుతూ నిర్లక్ష్య ధోరణి చూసిన హైకోర్టు, పిటీషనర్ కోరిన విషయంలో 60 రోజులలో స్పందించాలని రైల్వేశాఖను ఆదేశించడం శుభపరిణామమన్నారు. కొవ్వూరులో 2019 నాటి రైల్వేహాల్ట్‌లను యథాతదంగా పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో గారపాటి రామోహ్మనరావు, వీటీ విల్సన్‌రాజు, కేవీ రమణ, పడాల సుబ్బారెడ్డి, పీసీహెచ్ రామారావు, చిలంకుర్తి బాబి, తరుణ్‌కుమార్, మూర్తి, యాలం రమేష్, కృష్ణంరాజు, వెంకటేశ్వరరావు, మారుతి, బీఎస్ఎన్ మూర్తి, వైకే శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల నిరసన

- స్థానికంగానే వాహనాలకు ఫిట్‌నెస్ చెకింగ్ నిర్వహించాలి
- రాజానగరానికి తరలించడంపై మండిపాటు
- ఇన్‌చార్జి ఏవోకి వినతిపత్రం



ఇన్‌చార్జి ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఆటోడ్రైవర్లు

కొవ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వాహనాల ఫిట్‌నెస్ చెకింగ్‌ను జిల్లా కేంద్రానికి తరలించడంపై ఆటోడ్రైవర్లు ఆందోళన చేపట్టారు. కొవ్వూరులో మోటారు వెహికల్ కార్యాలయంలో నిర్వహించే వాహనాల ఫిట్‌నెస్ చెకింగ్‌ను మార్చి 14వ తేదీ నుంచి రాజానగరం తరలించడంపై గురువారం ఆటోడ్రైవర్లు బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన తెలుపుతూ ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఏవో కె. రవివిక్రమ్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై పలువురు ఆటోడ్రైవర్లు మాట్లాడుతూ వాహనాల ఫిట్‌నెస్ కోసం కొవ్వూరు నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి సుమారు 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని, ఒకవేళ పని జరగకపోతే ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. కొవ్వూరు రవాణా శాఖ కార్యాలయ పరిధిలోని వాహనాలకు ఫిట్‌నెస్ కొవ్వూరులోనే నిర్వహించి సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం. సుందరబాబు, ఆటో యూనియన్ నాయకులు ఏసారపు శ్రీను, పాలంగి రాజు, రాజేంద్ర, పాతాళ శ్రీనివాస్, బోసిబాబు, డోలా కొవ్వూరు, తదితరులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 12 గంటలకు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్ర కుమార్ తెలిపారు. చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. దీనికి 23 వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

రైతుల ఆదాయం పెంచడమే ప్రధాని ధ్యేయం

• బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర

కొవ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఆదాయం పెంచడమే ప్రధాని మోదీ ధ్యేయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారురు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుడుపర్చడానికి, రైతుల ఆదాయం పెంచడానికి, పాడి పరిశ్రమ అభివృద్ధికి మోదీ నాయకత్వం పనిచేస్తోందన్నారు. వ్యవసాయంతో పాటు పశువుల పెంపకం, పాల ఉత్పత్తిని పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తుందన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకానికి రూ. 1000 కోట్లు, నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంటు పథకానికి రూ. 1000 కోట్లను కేంద్ర ప్రభుత్వం అదనంగా కేటాయించిందన్నారు.

శోభన్‌బాబు 17వ వర్ధంతి



శోభన్‌బాబు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అభిమానులు

కొవ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ సినీ నటుడు శోభన్‌బాబు 17వ వర్ధంతిని కొవ్వూరు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహం సెంటర్‌లో శోభన్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యుడు కె.ప్రకాష్ ఆధ్వ ర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పలువురు మాట్లాడుతూ ఆనాటి నటుల్లో ఈయన పాత్రలు అద్వితీయంగా ఉండేయన్నారు. కార్యక్రమంలో అనపర్తి గోపాలకృష్ణ, పాకా శ్రీనివాస్, అభిమానులు పాల్గొన్నారు.

ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

తాళ్లపూడి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాగోలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న హెచ్ఎం డీడీ రావు విద్యార్థులకు పిచ్చుకల ఆవశ్యకత గురించి వివరించారు. పిచ్చుకలు, ఎక్కువగా జనావాసాల్లో కనిపిస్తుంటాయని, ప్రస్తుతం వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రపంచ నలుమూలలా ఉన్న పక్షి పరిరక్షకులు వాటిని కాపోడుకోవటమే లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. పాఠశాల విద్యార్థులు, ఆయా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనం చేయొద్దంటూ వినతి



ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న జూనియర్ బేసిక్ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు

చాగల్లు, మార్చి 20, (ఆంధ్రజ్యోతి) :స్థానిక జూనియర్ బేసిక్ స్కూల్‌లోని 3,4,5 తరగతు లను నెలటూరు ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఎంఈవో యు. గురునాథంకి విద్యార్థుల తల్లిదండ్రులు, సీపీఎం నాయకులు, తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల ఆవర ణలో తల్లిదండ్రులతో ఎంఈవో సమావేశాన్ని నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ చాలాకాలంగా ఉన్న పాఠశాలలను ఈవిధంగా విలీనం చేయడం తగదని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనాల కోసమే ఈ విధంగా చేయడం జరిగిందన్నారు. తల్లిదండ్రుల అభిప్రా యాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేకే దుర్గారావు, కంకటాల బుద్దుడు, జీవీ సుబ్బారావు, స్థానిక నాయకులు ఇంటి వీర్రాజు, మిరిమాల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పటిక బెల్లంతో తులాభారం



బాలదుర్గమ్మ ఆలయంలో తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బాలదుర్గమ్మ ఆలయంలో గురువారం పటిక బెల్లంతో తులాభారం నిర్వహించారు. లండన్ వాస్తవ్యులు కవల నరేశ్, దివ్య దంపతుల కుమార్తె హార్షకి పటికబెల్లంతో తులాభారం నిర్వహించి అమ్మవారి మొక్కు తీర్చుకున్నారు. ఆలయానికి అధికసంఖ్యలో భక్తులు వచ్చి అమ్మ వారికి కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పైడికొండల సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావు, పిన్నమని వెంకటకృష్ణ, గారపాటి అప్పారావు, పైడికొండల శివయ్య, జాజి మొగ్గల ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపర్రులో రూ 1.50 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం

ఉండ్రాజవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రులో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సిమెంట్ డ్రైనేజీని నిర్మిస్తున్నట్టు గ్రామసర్పంచ్ కరుటూరి నరేంద్ర బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆ పనులను మండల శానిటేషన్ కోఆర్డినేటర్ కత్తుల ప్రకాష్ పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ మురుగు పారుదలకు రూ.1.50 లక్షలతో 160 మీటర్ల పొడవుగల డ్రైనేజీ నిర్మిస్తున్నట్టు వివరించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. ఈయనతోపాటు గ్రామస్థులు, తదితరులు ఉన్నారు.

అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొవ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కొవ్వూరు సీడీపీవో డి. మమ్మీ తెలిపారు. ఆరికిరేవుల -2 ఓపెన్ కేటగిరి, కుమారదేవం - 3 బీసీ - డీ, చాగల్లు మండలం గౌరిపల్లి- 1బీసీ - బీ, ధారవరం - 2 ఎస్సీలకు కేటాయించడం జరిగిందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు నివాసము, కులము, 10వ తరగతి మార్కుల లిస్టు, పుట్టినతేదీ, అంగవైకల్యం, భర్త మరణించినట్టయితే ధ్రువీకరణపత్రం, మైనర్ పిల్లలు ఉన్నట్టయితే ధ్రువీకరణ పత్రం, ప్రీస్కూల్ ట్రైనింగ్ పూర్తిచేస్తే ధ్రువీకరణ పత్రం అన్నీ కలిపి గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించి ఈనెల 29వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు కొవ్వూరు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని నాలుగు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ఈనెల 29 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పెరవలి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీలక్ష్మి గురువారం తెలిపారు. పసలపూడిలో ఒకటి, కాల్ధరిలో రెండు, దమ్మెన్నులో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. కనీస విద్యార్హత పదోతరగతి ఉత్తీర్ణులై , వయస్సు 35 సంవత్సరాల లోపు ఉండాలని ఆమె పేర్కొన్నారు.

ఫిజియోథెరపీతో ఒత్తిడి నుంచి ఉపశమనం

ఉండ్రాజవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి వల్ల ప్రభుత్వ ఉద్యోగులకు వస్తున్న శారీరక ఇబ్బందులను ఫిజియోథరపీ ద్వారా ఉపసమనం పొందవచ్చని నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(హైదరాబాదు)కు చెందిన ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మహేష్‌కుమార్, డాక్టర్ రమేష్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఫిజియోథెరపీపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వివిస్ రామారావు, ఈవోపీఆర్డీ కె. ఆంజనేయశర్మ, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

గోపాలపురం, మార్చి20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సబ్సిడీతో అందించే బ్యాంకు రుణాలు అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ బీఎస్ఎస్.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన తరగతులు బీసీ కులానికి చెందిన వారికి బీసీ ఏ, బీ, సీ, డీ, ఈ, 67 వర్గాల వారికి స్వయం ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వం సబ్సిడీతో కూడిన లోన్‌లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే కాపు సామాజిక వర్గం కాపు, తెలగ, బలిజ, ఒంటరి వర్గాలవారికి 18 స్వయం ఉపాధి సోపానాలకు ప్రభుత్వం సబ్సిడీతో బ్యాంకు రుణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భూసంస్కరణలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారుడు అయినాపురపు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూసంస్కరణలు అమలు చేసి సిలింగు చట్టప్రకారం 50శాతం భూమి ఎస్సీ ఎస్టీలకు పంపిణీ చేయాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 34,349 ఎకరాల సీలింగ్ మిగులు భూములు ఉన్నా యని వాటిలో 15,500 ఎకరాలు పంపిణీ జరిగిందని అప్పటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ సీసీఎస్‌యూ నివేదిక పంపారని తెలిపారు. సుమారు 18848 ఎకరాలు కోర్టులో వివాదంలో ఉన్నాయని కోనేరు రంగారావు భూ కమిటీ నివేదించిందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రారంభించిన భూ పంపిణీ కార్యక్రమంలో పంచిన సీలింగ్ భూములు వెయ్యి ఎకరాలలోపే ఉన్నాయన్నారు. ఇప్పటికైనా తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు బాధ్యత వహించి సీలింగ్ భూములన్నీ వేరే పార్టీకి రిజిస్ట్రేషన్స్ జరుగకుండా 22ఏ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న 18,848 ఎకరాల విషయమై సత్వర చర్యలు తీసుకొని కోర్టు లిటికేషన్ నుంచి తప్పించి పంపిణీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రౌతులపూడి మండలంలో 50 ఏళ్లుగా వివాదంలో ఉందని, అయితే తహశీల్దార్ డిజిటల్ పట్టాదారు పాస్ పుస్తకాలు ఈ ఏడాది ఫిబ్రవరిలో మంజూరు చేశారని, దానిపై ప్రభుత్వం విచారణ జరిపి తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత ఆదివాసీ మహాసభ వ్యవస్థాపకుడు, భారత రాజ్యాంగ సభ సభ్యుడు జైపాల్ సింగ్ ముండా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళుల ర్పించారు. సమావేశంలో ఆదివాసీ మహాసభ సభ్యులు జక్కల పాండవులు, గూన అప్పన్న, అర్జన్న, మల్లేశ్వరి, చీడిపల్లి లక్ష్మణ, గొలగాని నూకాలమ్మ, చంద్రావతి, తదితరులు పాల్గొన్నారు.

22న 'ఆర్ట్స్'లో సంకల్ప మెగా జాబ్‌మేళా

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 22న సంకల్ప మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో సంకల్ప జాబ్‌మేళా పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, 25 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళీ జాబ్‌మేళా వివరాలు మాట్లాడుతూ ఆసక్తి కల్గిన నిరుద్యోగ యువత నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్ యూజర్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అవసరమైన అర్హతాపత్రాలతో అభ్యర్థులు శనివారం రోజు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని చెప్పారు.

నేడు కులవృత్తుల వారితో సమావేశం : ఎంపీడీవో

చాగల్లు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదరణ-3 పథకం ప్రవేశపెట్టడానికి ప్రణాళికలు రూపొందించడం కోసం మండలంలోని కులవృత్తుల వారి సంఘాలతో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి హాజరై తగిన సూచనలు తెలియజేయాలని కోరారు. ప్రతిఒక్కరూ విధిగా హాజరుకావాలని సూచించారు.

మద్దూరి అన్నపూర్ణయ్య 126వ జయంతి

● శ్రీపాద శ్రీనివాస్ రూపొందించిన బ్రోచర్ ఆవిష్కరణ... పలువురికి అవార్డులతో సత్కారం



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు


రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయుడు మద్దూరి అన్నపూర్ణయ్య త్యాగధనుడని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, అశోక్‌కుమార్ జైన్ కొనియాడారు. మద్దూరి అన్నపూర్ణయ్య 126వ జయంతి సందర్భంగా మద్దూరి అన్నపూర్ణయ్య సేవా సమితి ఆధ్వర్యాన గురువారం స్థానిక జండా పంజా రోడ్‌లోని మద్దూరి అన్నపూర్ణయ్య పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రకాశంనగర్‌లోని ధర్మంచర కమ్యూనిటీ హాల్‌లో జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణయ్య జీవితానికి సంబంధించిన కీలక ఘట్టాలతో శ్రీపాద శ్రీనివాస్ రూపొందించిన బ్రోచర్‌ను రౌతు ఆవిష్కరించారు. అనంతరం వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని అవార్డు, పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో పసుపులేటి కృష్ణ, ఎ.సత్యనారాయణ, పి.వీరబాబు, ఎన్.శేషగిరి, బీఎస్ఎన్ఎల్ సాయి బాబా, పిల్లాడి శ్రీనివాస్, అబ్దుల్లా షరీఫ్, బుడ్డిగ రవి, తదితరులు పాల్గొన్నారు.

హలీమ్‌కు .. సలామ్



రాజమహేంద్రవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌మాసం వచ్చిందంటే.. నోరూరించే రంజాన్ రుచులు అందుబాటులోకి వస్తాయి.. భగభగమండే బట్టీలు, గరంగరం హలీమ్‌తోపాటు నోరూరించే తియ్యని ఖీర్, ఖుర్బానీ మిఠాయి రుచులు రంజాన్ మాసంలో భిన్న పంటకాలు దర్శనమిస్తాయి. మసాలా వాసనలు గుప్పుమంటుంటే అటు వైపుగా వెళ్లన్న భోజన ప్రియులను అమితంగా ఆకర్షిస్తాయి. కాకినాడ జిల్లాలో తుని, పెద్దాపురం, పిఠాపురం, తదితర ప్రాంతాల్లో ఈ హలీమ్ బట్టీలు దర్శనమిస్తున్నాయి. కాకినాడలో భారీ స్థాయిలో హలీమ్ అమ్మకాలు జరుగుతుండడంతో జిల్లా నలుమూలల నుంచి వచ్చి హలీమ్ రుచి చూడడంతోపాటు కుటుంబ సభ్యులకు, మిత్రులకు పార్శిళ్లు తీసుకెళుతున్నారు. గతంతో పోలిస్తే కాకినాడ నగరంలో నాగమల్లితోట జంక్షన్, జేఎన్టీయూ, భాను గుడిసెంటర్, మసీదు సెంటర్, జగన్నాథపురం వంటి సెంటర్లతోపాటు సుమారు 10 ప్రాంతాల్లో వీటిని ఏర్పా టుచేసి అమ్ముతుండగా, కొన్ని రెస్టారెంట్లలో హలీమ్ తయారు చేసి అమ్ముతున్నారు. రంజాన్ మాసం ప్రారంభమయ్యాక హలీమ్ సందడి మొదలవు తుంది. షమీతుక్డా, కద్దుకా ఖీర్ స్వీట్స్‌పాటు మటన్, చికెన్ బిర్యానీ, కిమా సమోసా తదితర వంటకాలు నోరూరి స్తాయి. హలీమ్‌ను మటన్, చికెన్‌తో తయారుచేస్తారు. కాకినాడలో మటన్ హలీమ్ ఫ్యామిలీ ప్యాక్ రూ.400, చికెన్ ఫ్యామిలీ ప్యాక్ రూ. 300కు బాగా అమ్ముతు న్నారు. ముస్లింలు అధికంగా ఫ్యామిలీ ప్యాక్‌లే తీసుకెళు తున్నారు. ఒక్కో బట్టీ వద్ద రోజుకు సుమారు 150 నుంచి 200 వరకు ఫ్యామిలీ ప్యాక్‌లు ఆర్డర్లుగా అమ్ముడుపో తుండగా, బట్టీల వద్ద రోజుకు సుమారు రెండు వందల మందికి పైగా ఈ వంటకాలు తింటు న్నారు. వేకువజామున చేపట్టే ఉపవాసదీక్ష సాయంత్రం విరమించిన అనంతరం ముస్లింలు ఆహారం తీసుకుం టారు. గోధుమ రవ్వ, 15 రకాల మసాలాలతో నోరూరించేవిధంగా హలీమ్ తయారు చేస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఆజాద్ చౌక్ సెంటర్లో హలీమ్ విక్రయాలకు అడ్డాగా ఉంది. వందలాది మంది ఇక్కడకు వచ్చి హలీమ్ కొనుగోలు చేస్తున్నారు. ఈ దుకాణాలు రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటున్నాయి. అమలాపురంలో టౌన్‌బ్యాంకు వద్ద హలీం సెంటర్‌ను ఏర్పాటుచేశారు.

ఆరోగ్యకరం హలీం



హలీం వంటకం ఇరానీ తరహాలో తయారు చేస్తున్నాం. ఈ వంటకంలో జీడిపప్పు, పిస్తా, శనగపప్పు, మినపప్పు, గోధుమలతోపాటు మటన్, నెయ్యి, పంచదార వంటి ఆరోగ్యకరమైన అధిక ప్రోటీన్లు ఉండే వాటిని వినియోగిస్తున్నాం. ఉదయం 8 గంటలకు హలీం తయారీ ప్రారంభిస్తే సాయంత్రానికి అందుబాటులోకి వస్తుంది. కేవలం నాన్‌వెజ్‌లోనే మటన్ మీట్‌తో హలీంను తయారుచేస్తున్నాం. సింగిల్ ప్యాక్ ధర రూ.150 కాగా, ఫుల్ ప్యాక్ ధర రూ.200, ఫ్యామిలీ ప్యాక్ రూ.500కు విక్రయిస్తున్నాం. అన్నివర్గాల వారిని హలీం వంటకం ఆకట్టుకుంటుంది.

- మహ్మద్ ఆషిక్‌అలీ (మున్నా), హలీం సెంటర్ నిర్వాహకుడు